RNI.No.TELTEL/2000/00272

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

ASHISH MEDIA SERVICES (AMS)

You can download news from our 'AMS News Agency'

Logon to our website and registar.

www.ashishmediaservices.blogspot.com

Contant No. :9247698676

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 28 || సంచిక :66 || హైదరాబాద్ || శనివారం, మార్చి 22, 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

## సీఎం రేవంత్‌రెడ్డితో
# హరీష్‌రావు భేటీ

- నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేసినట్లు సమాచారం.
- డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్‌ను బహిష్కరించాం
- చెన్నైలో జరిగే మీటింగ్ కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయట్లేదు
- డీఎంకే వాళ్ళు పిలిచారని మేము వెళ్తున్నాం..
- డీఎంకే మాకు ఫ్రెండ్లీ పార్టీ
- ఘోష్ కమిటీ నివేదిక గురించి నాకు తెలియదు
- డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ పార్టీకి ఓ స్టాండ్ లేదు...



**హైదరాబాద్:**
సీఎం రేవంత్‌రెడ్డితో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు భేటీ అయ్యారు. ఆయన వెంట పద్మారావు, మాజీ మంత్రి మల్లారెడ్డి ఉన్నారు. సీఎంతో అరగంటకు పైగా హరీష్‌రావు మాట్లాడారు. నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. భేటీ అనంతరం పద్మారావు మీడియాతో మాట్లాడుతూ.. .



## వచ్చే ఏడాది ఇదేరోజుకి
# నక్సల్స్‌ని ఏరేస్తాం

- అంతర్గత భద్రత పటిష్టతకు కట్టుదిట్టమైన చర్యలు
- **2026 మార్చి 21వ తేదీ నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తాం**
- బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో నక్సల్స్ సమస్య నుంచి దేశానికి విముక్తి లభించనుంది
- దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశంలో అభివృద్ధి ముదుకు సాగలేదు.
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

## తక్కువ వడ్డీకే
# రుణాలివ్వండి

- నాబార్డు ఛైర్మన్‌తో సీఎం రేవంత్ భేటీ
- మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలి
- కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలి
- కొత్తగా మరిన్ని కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలి
- స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి



**హైదరాబాద్**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నాబార్డ్ ఛైర్మన్ షాజీ కేవీ శుక్రవారం భేటీ అయ్యారు. ఆర్ఐడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలు అందించాలని నాబార్డు ఛైర్మన్‌ను సీఎం కోరారు. మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని సీఎం కోరారు. కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని, కొత్తగా మరిన్ని కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని నాబార్డు ఛైర్మన్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరిన సీఎం.. ఐకేపీ, గోడౌన్స్, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్‌లు నిధులు మార్చి 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. నాబార్డు పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలని సీఎం అన్నారు. -



# పరారీలో సెలబ్రిటీలు

- బెట్టింగ్ పాపాల లెక్కలు తేలడం పక్కా!
- బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది
- స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు

**హైదరాబాద్**
తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలతో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో పోలీసులు దూకుడుగా ముందుకెళ్తున్నారు. బెట్టింగ్ యాప్స్ యజమానులే టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధితుల వివరాలు సేకరించారు. బెట్టింగ్ ఊబిలో చిక్కుకుని ఒక్క ఏడాదిలో 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేసులు నమోదు చేశారు. ఆయా బెట్టింగ్ -

## బయట ప్రశ్నిస్తే జైళ్లకు..
# లోపల ప్రశ్నిస్తే సస్పెండ్

- రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న ఎర్రర్ కారణంగా.. టెర్రర్‌ను చూపిస్తున్నారు
- రాహుల్ గాంధీ మొహబ్బత్ క దుకాన్ అని దేశం అంతా తిరుగుతున్నడు
- రేవంత్ పాలన నఫ్రత్ కా మకాన్‌గా మారింది
- తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వస్తదంటే జనం ఏమో అనుకున్నరు
- ఎమర్జెన్సీ నాటి అణిచివేతలు, నిర్బంధాలు పునరావృతం అవుతాయి
- తెలంగాణలో ఆర్థిక క్షీణతకు అసలు కారణాలు ఇవే.. సభలో హరీశ్‌రావు



**హైదరాబాద్**
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో ఆర్థిక క్షీణతకు అసలు కారణాలను హరీశ్‌రావు వివరించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ పదిహేను నెలల కాలంలో జీఎస్టీ వృద్ధి రేటులో తగ్గుదల, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయంలో తగ్గుదల, వాహనాల అమ్మకాల్లో తగ్గుదల, దీనికి కారణం ఆర్థిక -



## హనీట్రాప్ వ్యవహారంపై
# అట్టుడికిన అసెంబ్లీ

- సీడీలు ప్రదర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు
- అసెంబ్లీలో హనీట్రాప్ వ్యవహారంపై రగడ
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య పసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళన
- మంత్రులే తమపై హనీట్రాప్ జరిగిందని ఆరోపిస్తున్నారని నినాదాల
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు శాలరీ డబుల్!



## అసమానత్వం, వివక్షపై
# నిజం నిగ్గుతేలాలి

- కులగణనపై మళ్లీ రాహుల్ వ్యాఖ్యలు
- మహద్ సత్యాగహపైన, అడ్మినిస్ట్రేషన్, విద్య, బ్యూరోక్రసీ, వనరుల విషయంలో దళితులు జరుపుతున్న పోరాటంపైన చర్చించడం జరిగింది
- ఇది సమానత్వం, గౌరవానికి సంబంధించిన పోరాటమని, 98 ఏళ్ల క్రితం మొదలైన ఈ పోరాటం ఇప్పటికీ కొనసాగుతోంది

# తెలంగాణ పరువు తీసిందెవరు?



- కవితపై సీతక్క సీరియస్
- మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు
- ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్రం పరువు తీసింది.. మీ కుటుంబమే
- కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్
- మహిళలకు అడుగడుగున అన్యాయం చేసింది బీఆర్ఎస్సే"
- "మొదటి ఐదు సంవత్సరాల్లో మంత్రి పదవిలో మహిళలు లేరు
- మహిళా కమిషన్‌కి సభ్యులు లేరు.

**హైదరాబాద్**
సీఎం రాష్ట్రం పరువు తీస్తున్నారంటూ శాసన మండలిలో కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. మీ కుటుంబమే పరువు తీసిందంటూ కవితపై మండిపడ్డారు. మాకు ఢిల్లీ వ్యాపారాలు తెలియవు. ఢిల్లీ వ్యాపారాలతో రాష్ట్రం పరువు తీసింది.. మీ కుటుంబమే.. కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్.. మహిళలకు అడుగడుగున అన్యాయం చేసింది బీఆర్ఎస్సే" అంటూ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. "మొదటి ఐదు సంవత్సరాల్లో మంత్రి పదవిలో మహిళలు లేరు. మహిళా కమిషన్‌కి .

## తెలంగాణలో భారీ వర్షం..
# వడగళ్ల వాన



- ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇక్కట్లు
- మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడగా..
- సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం

## సంపాదకీయం

### మోడీ, ట్రంప్ సారూప్యాలు

ఇప్పటి వరకైతే భారత్, అమెరికా రెండూ పెద్ద ప్రజాస్వామిక దేశాలే. ఎవరూ కాదనటం లేదు. కానీ ఆచరణ చూస్తే నిరంకుశత్వానికి దారితీస్తున్నట్లుగా వ్యవహరించటం ఆందోళన కలిగిస్తోంది. వ్యవస్థలను దిగజారుస్తున్నారు, కొత్త అర్థాలు చెబుతున్నారు, పాలకులను విమర్శించటాన్ని దేశ ద్రోహంగా చిత్రిస్తూ బ్రిటీష్ వలస పాలకులను గుర్తుకు తెస్తున్నారు. మన గతం గురించి మరుపొచ్చినా కానీ దాన్ని గుర్తు చేయటం కూడా ఒకందుకు మంచిదేమో? ఏదీ ఊరికే రాదు అన్నట్లుగా మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఊరికే రాలేదని కొందరైనా తెలుసుకుంటారు. రెండు చోట్ల చట్టాలు, నిబంధనలకు వక్రభాష్యాలు చెప్పి భావ ప్రకటన, నిరసన తెలిపే హక్కును హరించే ఉదంతాల గురించి చెప్పుకోవటం దేశ వ్యతిరేకతగా పరిగణించినా ఆశ్చర్యం లేదు. రోజులిలా ఉన్నాయి. ఏం జరిగినా ఎవరొక్కరూ తప్పదు. గత ఏడాది ఏప్రిల్ నెలలో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) అభివృద్ధి, అధ్యయనాల విభాగంలో పిహెచ్‌డి చేస్తున్న రామదాస్ ప్రిని శివానందన్ అనే పరిశోధకుడిని సంస్థ సస్పెండ్ చేసింది. ఎందుకట! ఢిల్లీలో విద్యార్థులు 'భారత్‌ను రక్షించండి-బిజెపిని తిరస్కరించండి' అనే నినాదంతో పార్లమెంట్ వద్ద ప్రదర్శన నిర్వహించారు, దానిలో భాగస్వామి కావటం జాతి వ్యతిరేక కిందకు వస్తుందని కారణం చెప్పింది. కేరళలో దళిత సామాజిక తరగతికి చెందిన ఈ యువకుడు ముంబైలో చదువుతూ మహారాష్ట్ర ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శిగా పని చేశాడు. టిస్ చెప్పిన సాకులు లేదా కారణాలను చూస్తే ఎవరూ కూడా ప్రభుత్వాల విధానాల మీద నిరసనలు, అసమ్మతి తెలపటానికి వీల్లేదు. ఎందుకంటే ఏదో ఒక ప్రభుత్వ పథకం కింద ఆర్థికంగానో, సేవా పరంగానో ప్రతిఫలం లబ్దిదారులే. అలాంటపుడు ఎవరూ ఏ ప్రభుత్వాన్నీ విమర్శించకూడదు. భజన మాత్రమే చేయాలి! కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో విమర్శించారు. దాన్లో పాల్గొన్నందున శివానందన్ జాతి వ్యతిరేకి అనటమే కాదు అతని మీద చర్యలు తీసుకొనేందుకు దర్యాప్తు సంస్థలను ముందుకు రావాలని కూడా టిస్ కోరింది. న్యాయ వ్యవస్థ ఇంకా ఉనికిలో ఉంది గనుక ఆ సస్పెన్షన్ చెల్లదని ప్రకటించాలని కోరుతూ అతను బొంబే హైకోర్టుకు వెళ్లాడు. ఎం.ఎం సత్తాయి, ఎ.ఎస్ చందూర్కర్ డివిజన్ బెంచ్ అతని పిటీషన్‌ను కొట్టివేస్తూ టిస్‌కు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయనున్నట్లు శివానందన్ చెప్పాడు. ఇది వ్యక్తిగత సమస్య కాదని మొత్తం విద్యార్థి సమాజం మీద ప్రభావితం చూపనుందని అన్నాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ పొందుతున్న కారణంగా రాజకీయ పరమైన కార్యకలాపాలలో పాల్గొంటే చర్యలు తప్పవని, సంస్థలో ఉన్నపుడు రాజకీయ అభిప్రాయాలకు దూరంగా ఉండాలని కోర్టు పేర్కొన్నది. ఒక తెలికాం ఉద్యోగి యువకుడిగా ఉన్నపుడు ఒక యువజన సంఘ సమావేశంలో పాల్గొన్నందున ఉద్యోగం నుంచి తొలగించిన కేసు సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. అతను పాల్గొన్నది నిషేధిత సంస్థ కాదు, యువకులు యువజన సంఘాల సమావేశాల్లో గాక మరిదేనిలో పాలుపంచుకోవాలని ప్రశ్నిస్తూ ఉద్యోగం నుంచి తొలగించటాన్ని తప్పు పడుతూ జస్టిస్ ఓ చిన్నపరెడ్డి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు. తరువాత ఉద్యోగిగా ఆ యువకుడు ఉద్యోగ విరమణ చేసేవరకు తెలికాం ఉద్యోగుల యూనియన్లో కూడా చురుకుగా పని చేశాడు. కోర్టు పేర్కొన్న అంశాలు సరైనవి కావని, ఒక విద్యార్థి అర్హత పరీక్షల్లో పాసైనపుడు ఫెలోషిప్ ఒక హక్కు తప్ప దయాదర్మం కాదని, పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్ ఇవ్వటం తనంతట తాను బతకటానికి అవసరమైన ఉద్యోగ సంపాదన కోసం కాదని, జాతి నిర్మాణ క్రమంలో తోడ్పడేందుకు ఇచ్చే మొత్తమని శివానందన్ చెప్పాడు. ఏ విద్యా సంస్థ అయినా జారీచేసే సర్క్యులర్ కంటే రాజ్యాంగం ఎంతో ముఖ్యమైనదని తాను భావిస్తున్నానని, రాజ్యాంగ హక్కును వినియోగించు కున్నందుకు తనను శిక్షించారని అన్నాడు. టిస్ లేదా ఏ విశ్వవిద్యాలయం జారీ చేసే నిబంధనలు, సర్క్యులర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగాన్ని ఉల్లంఘించకూడదని, విద్యా సంస్థలు నిష్పక్షికంగా ఉండాలని, ఒక తరహా రాజకీయాలకు ఒక విశ్వవిద్యాలయం తనను తాను ఎలా అంటిపెట్టుకుంటుందని ప్రశ్నించాడు. 'భారత్‌ను రక్షించండి, బిజెపిని తిరస్కరించండి' అనే నినాదంతో పార్లమెంట్ ప్రదర్శనలో పాల్గొంటే%శా%తాను పట్టుకున్న ప్లకార్డు మీద టిస్ పేరు ఉన్నట్లు అధికారులు ఆరోపించారని చెప్పాడు. ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్ (పిఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా ప్రదర్శనలో పాల్గొన్నాను తప్ప టిస్ ప్రతినిధిగా కాదని అన్నాడు. తనను సస్పెండ్ చేసిన టిస్ కమిటీ, హైకోర్టు ముందు కూడా ఇదే చెప్పానన్నాడు. శివానందన్ 2015లో టిస్ పోస్టు గ్రాడ్యుయేట్‌గా చేరి తరువాత అక్కడే ఎంఫిల్ పూర్తి చేసి పరిశోధక విద్యార్థిగా నమోదయ్యాడు. టిస్ గతంలో ఒక ప్రజాస్వామిక సంస్థగా కనీసం నటించేదని ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులు చేపట్టే ఎలాంటి కార్యక్రమాలకు అనుమతించటం లేదని చెప్పాడు. అయోధ్యలో రామాలయ ప్రారంభాన్ని ఒక జాతీయ కార్యక్రమంగా చేపట్టినపుడు జాతీయ అవార్డు పొందిన ఆనంద పట్వర్ధన్ డాక్యుమెంటరీ 'రామ్ కె నామ్ (రాముడి పేరుతో)'ను అనేక విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శించారని తాను ఆ సమయంలో ప్రమాదంలో గాయపడి ప్రదర్శనకు రాలేకపోయానని, అయితే బాబ్రీ మసీదు విధ్వంసం సందర్భంగా జరిగిన దుర్మార్గమైన వాస్తవాలను తెలుసుకొనేందుకు అందరూ చూడాలని కోరుతూ తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమంలో వెల్లడించగా దాన్ని కూడా దేశ వ్యతిరేక చర్యగా టిస్ తన మీదకు మళ్లించిందని పేర్కొన్నాడు. కేంద్రం నుంచి 50 శాతం పైగా నిధులు పొందుతున్న సంస్థలన్నింటిని కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకున్న తరువాత టిస్‌లో అనేక పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కడ పది మంది విద్యార్థులు కూర్చుంటే, చివరకు తమ గ్రూపు ప్రాజెక్టుల గురించి చర్చించేందుకు ఒక చోట చేరినా సంస్థను అస్థిరపరిచేందుకు చూస్తున్నారంటూ చెదరగొట్టటం జరుగుతోందన్నాడు. శివానందన్‌ను హెచ్చరిస్తూ అనేక సార్లు తప్పుడు నోటీసులు జారీ చేసింది. భగత్ సింగ్ స్మారక ఉపన్యాసం చేసేందుకు పిలిచిన అతిథులను 'వివాదాస్పద ప్రసంగీకులు' అనే సాకుతో వారి పేర్లు లేకుండా ఇచ్చిన నోటీసు అలాంటి వాటిలో ఒకటి. సదరు వివాదాస్పద అతిథులు ఎవరంటే మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, ప్రముఖ జర్నలిస్టు పి.శాయినాథ్, జెఎన్‌యు మాజీ ప్రొఫెసర్, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మాజీ సంపాదకుడు గోపాల్ గురు. గతేడాది టిస్ విద్యార్థి సంఘ ఎన్నికలను రద్దు చేసింది. ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరమ్‌ను నిషేధించింది. విద్యార్థులు ఆందోళన చేయటంతో వెనక్కు తీసుకుంది. ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే టిస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదు, కేంద్ర ప్రభుత్వ ఫెలోషిప్ తీసుకొనే వారు బిజెపి రాజకీయాలను విమర్శించకూడదంటే నేను అంగీకరించను, దేశంలో ఉండాలంటే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిజెపి సభ్యత్వం తీసుకోవటానికి లేదా సానుభూతిపరునిగా ఉండటానికి నన్ను ఒత్తిడి చేయలేరని శివానందన్ చెప్పాడు.

మహమ్మద్ ఖలీల్ అమెరికా పౌరసత్వం కలిగిన సిరియా దేశస్థుడు. అతని మీద చట్ట ఉల్లంఘనకు పాల్పడిన కేసులేవీ లేవు. అతన్ని బలవంతంగా సిరియా పంపేందుకు ట్రంప్ యంత్రాంగం చూస్తోంది. ఖలీల్ చేసిన నేరం ఏమిటో తెలుసా? గాజాలో పాలస్తీనియన్లపై మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఖండిస్తూ కొలంబియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల నిరసనకు నాయకత్వం వహించటమే. వాక్, సభా స్వాతంత్ర్యాలు విలసిల్లుతుంటాయని భావించే దేశంలో ఇది జరిగింది. అతని భార్య ఎనిమిది నెలల గర్భవతి, అరెస్టు చేసిన ఖలీల్ గ్రీన్‌కార్డును రద్దు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం అతనుండే న్యూయార్క్ రాష్ట్రం నుంచి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లూసియానాలోని ఒక నిర్బంధ శిబిరానికి తరలించి తన మానవత్వ ముఖాన్ని ప్రదర్శించు కుంది. ఈ ఉదంతం తరువాత గ్రీన్ కార్డు ఉన్నంత మాత్రాన ఎవరూ అమెరికాలో శాశ్వతంగా ఉండే హక్కు ఉన్నట్లు కాదని ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ ప్రకటించాడు. అంటే ప్రభుత్వం తలచుకుంటే ఎప్పుడైనా రద్దు చేయవచ్చునే బెదిరింపు దీని వెనుక ఉంది. పాలస్తీనియన్లకు మద్దతుగా విద్యార్థులు ఆందోళనకు దిగినపుడు స్థానికులా, వలస వచ్చినవారా అనే తేడా లేకుండా అందరూ నిరసనల్లో పాల్గొన్నారు. దీన్ని నాటి బైడెన్ సర్కార్, నేటి ట్రంప్ జమానా కూడా సహించటం లేదు.

గాజాలో మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికాలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ నిస్సిగ్గుగా మద్దతు ఇస్తూ మానవ హక్కుల పరిరక్షణ గురించి ప్రపంచానికి సూక్తులు వల్లిస్తారు. 2023లో డోనాల్డ్ ట్రంప్ ఒక ప్రతిజ్ఞ చేశాడు. అదేమంటే అమెరికా విధానాలను విమర్శించే విదేశీయులు, క్రైస్తవులను ద్వేషించే కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, సోషలిస్టులు ఎవరినీ అమెరికాలోకి అడుగుపెట్టనివ్వం.

# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత



నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసుకోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 1993 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. ఐక్య రాజ్య సమితి, ప్రపంచ జల దినోత్సవాన్ని 1992 యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, రియో డి జెనీరియో సమావేశంలో ప్రతిపాదించింది. దీన్ని 1993వ సంవత్సరం నుంచి నిర్వహించడం ప్రారంభించారు. మెరుగైన మంచి నీటి వనరుల నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహనా కల్పించడం కోసం ఐక్య రాజ్య తెలంగాణ ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతుంది. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీళ్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృథా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని.


ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

# రక్త దానం ఆరోగ్యానికి ప్రయోజనకరం"

అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టు మిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. రక్తం అంటే ఏమిటి.. రక్తదానం ఎలా చేయాలి.. ఎవరు రక్తదానానికి అర్హులు.. రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం..రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడు తుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. అవి అనే వర్గాలుగా విభజించాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్ గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించా లనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండుగడ్డి రంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని "ప్లాస్మా" అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని "గ్రహీత" అని, ఇచ్చే వ్యక్తిని "దాత" అని అంటారు. గ్రూప్ రక్తం కలిగిన వారిని "విశ్వదాత" అని, %ూదీ%. గ్రూపుల రక్తం కలిగినవారిని "విశ్వ గ్రహీత" అని అంటారు.

రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగ పడుతుంది. ఎవరు ఎవరికి రక్తం




దానం చేయ వచ్చంటే...%ూదీ% గ్రూప్ వారు %ూదీ% గ్రూప్ కి, %ూా% గ్రూప్ వారు , %ూదీ% గ్రూపుల వారికి కి, %దీ% గ్రూప్ వారు %దీ,ూదీ% గ్రూపుల వారికి కి, %ూా% గ్రూప్ వారు %ూా,దీ, ూదీ, ూా% గ్రూప్‌ల వారందరికి దానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే %ూదీ% గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. %దీ% గ్రూప్ వారు %దీ, ూా% గ్రూపుల వారి నుంచి, %ూా% గ్రూప్ వారు %ూా, ూా% గ్రూపుల వారి నుంచి, %ూా% గ్రూప్ వారు %ూా% గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు.. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 3-4 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35 నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ అనే ఈ మూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైన వారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హాని చేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవ డానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసర మవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని కాపాడడమే. ప్రతీ రెండు సెకన్లకు దేశంలో ఎక్కడోచోట ఒకరికి రక్తం అవసరమవుతుంది. ప్రతి రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. అత్యధికంగా కోరుకునే రక్తం "ఓ" గ్రూప్‌దేశంలో ఏటా కొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్ బాధితులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూ వారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, సుమారుగా 1 యూనిట్ రక్తాన్ని దానం చేయవచ్చు. దాని వల్ల దాత శరీరానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య వంతుడైన దాత ప్రతీ 56 రోజులకు ఒకసారి ఎర్ర రక్తకణాలను డొనేట్ చేయవచ్చు. ఆరోగ్యవంతుడైన దాత కనీసం 7 రోజుల విరామంతో సంవత్సరానికి 24 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చు. రక్తం కోసం ప్రతిరోజు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. తలసేమియా లాంటి డేంజర్ వ్యాధి గ్రస్తులకైతే ప్రతి 15 రోజుల కోసారి బ్లడ్ ఎక్కించక పోతే బతకడం కష్టం. కనుక ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, సాటి మనుషులను బతికించుకుందాం.

# జానపద సినీ కథానాయకుడు

తెలుగు సినీ రంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజుల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జాన పద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు. తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతా రావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నారదుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరిం చింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు". తెలంగాణ లోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగు వేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘి క, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దో షి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమా ల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయకుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొన గాడు' సినిమాలు తీశారు. రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భా లలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వర రావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు. ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరిం చింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పిం చాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్రల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు. కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969)బీ గండర గండడు (1969)బీ ప్రేమ జీవులు (1971)బీ గుండెలు తీసిన మొనగాడు (1974)బీ స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగా ణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది.

సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కోవాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు. ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టుకున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరా బాద్ చేరారు. చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతం



గా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు. అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు. సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతా రావు, తన 85వ ఏట, 2009 మార్చి 22న క్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

# జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి.

## మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ డిమాండ్.



భూపాలపల్లి మార్చి21(ప్రుదయం ప్రతినిధి): జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని దీక్షలో కూర్చున్న బహుజన్ సమాజ్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామి గౌడ్ గౌడ సంఘ నాయకులు నేరెళ్ల రామకృష్ణ గౌడ్

ఈ సందర్భంగా పొన్నం బిక్షపతి గౌడ్ మాట్లాడుతూసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 350 సంవత్సరాల క్రితమే తాటికల్లు అమ్మితే పైసలు వస్తాయి కొట్లాడితే రాజ్యం వస్తదని ఈ తెలంగాణ మట్టి పైన దొరల దోపిడీ పీడన దౌర్జన్యాల వ్యతిరేకంగా మంగలి మాసన్న కుమ్మరి గోవిందు మాదిగ మైసన్న చాకలి సర్వాయి దూదేకుల పీర్ మహ్మద్ పీడిత బహుజన కులాలను ఏకం చేసి కూలీల శ్రమ దోచుకునే దొరల గడీలపై గెరిల్లా దాడులు చేసి దొరల గడీల్లోని ధాన్యాన్ని పేద ప్రజలకు పంచి పీడిత బహుజన కులాలకు గంజిలో మెతుకై దొరలకు కంటిలో నలుసై దొరలను జాగిర్ధర్ జమిందార్ దేశ్ముఖ్ లను గడగడలాడించిన కోటలను స్వాధీనం చేసుకొని గోల్కొండ కోట పైన బహుజనుల ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసిన మహోన్నత శిఖరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు పాపన్న సహచరుడు చాకలి సర్వాయి గెరిల్లా యుద్ధంలో అమరత్వం పొందినప్పుడు తల్లడిల్లిన పాపన్న తన పేరు ముందు సర్వాయి పాపన్న గౌడ్ గా నామకరణం చేసుకొని తన ప్రాణ మిత్రుని రుణం తీసుకున్నాడు పాపన్న సర్వాయి పాపన్న ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో బహుజన రాజ్యాన్ని సాధించి సర్వాయి పాపన్న కలలు కన్నా దోపిడీ పీడన అవమానాలు లేని అణగారిన వర్గాల రాజ్యం కోసం ఎస్సీలు ఎస్టీలు బీసీలు మైనార్టీలు ఏకమై తెలంగాణలో బహుజన రాజ్యం సాధించాలని అన్నారు

సర్దార్ సర్వాయి పాపన్న పేరు జనగామ కు పెట్టాలని న్యాయమైన డిమాండ్ కు అన్ని వర్గాల ప్రజలు ప్రజాస్వామికవాదులు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు విద్యార్థి మేధావులు అండగా ఉండాలని కోరారు

# విదేశీ విద్యకు ఎంపికైన పద్మశాలి ముద్దుబిడ్డ అక్కల ప్రియాంక



గద్వాల మార్చి 21 (ప్రుదయం ప్రతినిధి) గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహాయ సహకారంతో బీసీ వర్గ చేనేత కార్మిక కుటుంబానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ అక్కల ప్రియాంక మహాత్మ జ్యోతిబా పులే విదేశీ విద్య పథకంలో ఉన్నత చదువులకు ఎంపికయ్యారు. వెనకబడిన వర్గాలోని పేదవాళ్లకు మహాత్మ జ్యోతిబా పూలే విదేశీ విద్యా పథకం ఒక వరం. విదేశాల్లో పీజీ కోర్సులు చదివేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వెనుకబడిన వర్గాలకు చెందిన 60 మంది విద్యార్థులను సెలక్షన్ చేయగా జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణా పద్మశాలి కులానికి చెందిన చేనేత కార్మికుడు అక్కల శాంతారాం కుమార్తె అక్కల ప్రియాంక విదేశీ విద్య పథకం కింద సెలక్షన్ కావడం సంతోషం వెలిబుచ్చారు. గద్వాల ఎమ్మెల్యే సహాయ సహకారంతో మహాత్మ జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి బీసీ వర్గాలకు విదేశీ విద్య పథకం కింద సీటు రావడానికి కృషిచేసిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. న్యూయార్క్ నందు మాస్టర్ ఆఫ్ సైన్స్ రెండు సంవత్సరాల కోర్స్ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున 20 లక్షలు స్కాలర్షిప్ ప్రభుత్వం భరిస్తున్నందుకు నాలాంటి బీద, బడుగు, బలహీన వర్గాల బిసి కులానికి చెందిన చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి పై చదువులకు విదేశాలలో చదవడానికి చేయూతనిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, బీద కులాలకు చేయూతనిచ్చే నాయకుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అని విద్యార్థిని అక్కల ప్రియాంక తెలిపారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



గద్వాల మార్చి 21 (ప్రుదయం ప్రతినిధి) జిల్లాలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఈరోజు జిల్లా కేంద్రం లోని పరీక్షలు జరుగుతున్న విశ్వేశ్వరయ్య మెమోరియల్ హైస్కూల్ , ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాలను సందర్శించి పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ఏలాంటి లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం అని, పరీక్షా సమయం లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలి అని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాలలోనికి సెల్ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని, దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉంచే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్పి వెంట డి.ఎస్పి వై మోగిలయ్య , పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్ ఉన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా రెండున్నర ఎకరాల సుబాబుల తోట దగ్దం



మధిర,మార్చి21(ప్రుదయం ప్రతినిధి) విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపంతో ట్రాన్స్‌ఫార్మర్ నుండి నిప్పురవ్వలు ఎగసిపడి పక్కనే ఉన్న సుబాబుల తోటకి అంటుకొని సుమారు రెండున్నర ఎకరాలు తోట దగ్నం అయిన ఘటన మండలంలోని దెందుకూరు గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది.మండల పరిధి దెందుకూరు గ్రామానికి చెందిన రైతు అయితం ప్రసాద్ కి చెందిన సర్వే నెంబర్ 44/ఇ మరో రైతుకి చెందిన సుబాబుల్ తోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ నుండి నిప్పురవ్వలు ఎగసి సుబాబుల తోటలో పడటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది,స్థానికులతో కలిసి మంటలను అదుపు చేశారు. సుమారు రెండున్నర ఎకరాల మేర మంటలు వ్యాపించడంతో తోట దగ్నమై రూ. 3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే సుబాబుల తోట దగ్నం అయినదని ఆరోపించారు. ఎన్నోసార్లు విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ఇక్కడి నుంచి తీసివేయాలని చెప్పిన అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి తీవ్ర నష్టం కలిగిందని ఈ నష్టాన్ని విద్యుత్ శాఖ భరించాలని ఆయన కోరారు.మరోసారి ఇటువంటి ప్రమాదం జరగకుండా ఇక్కడ నుండి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తీసివేయాలన్నారు.

# విద్యార్థులు అన్ని పరీక్షలు ఉత్సాహంతో సమర్థవంతంగా వ్రాయాలి.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి మార్చి 21(ప్రుదయం ప్రతినిధి) 10వతరగతి విద్యార్థులు తొలి రోజంతటి ఉత్సాహంతో మిగిలిన అన్ని పరీక్షలను కూడా సమర్థవంతంగా వ్రాయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి, గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతి లేని కారణంగా సెల్ ఫోన్ ను వాహనంలో ఉంచి వెళ్లారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు తొలి రోజంతటి ఉత్సాహంతో మిగిలిన అన్ని పరీక్షలను కూడా సమర్థవంతంగా వ్రాయాలని ఆకాంక్షించారు. అలాగే పరీక్షలు నిర్వహణ నిబంధనలను పకడ్బందీగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. మిగిలిన పరీక్షలు విద్యార్థులు ఏ విధమైన ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో వ్రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, పర్యవేక్షణ, విద్యార్థులకు తాగునీరు, లైటింగ్, ఫర్నిచర్, టాయిలెట్ సదుపాయాల ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి తహశీల్దార్ శ్రీనివాసులు, పరీక్షా కేంద్రాల సిఎస్ లు తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ యస్ పార్టీ క్యాలెండర్,డైరీ ని ఆవిష్కరించిన నాయకులు



మధిర,మార్చి21(ప్రుదయం ప్రతినిధి) మధిర బి ఆర్ యస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల, టౌన్ పార్టీ ఆధ్వర్యంలో బి ఆర్ యస్ పార్టీ 2025 వ సంవత్సర డైరీలు,క్యాలెండర్లను ఆవిష్కరించిన నాయకులు.ఈ కార్యక్రమం లో మధిర మండల మరియు టౌన్ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, మొండితోక జయాకర్, సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు,సీనియర్ నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరావు,గంగరాజు, విరాశెట్టి కాళేశ్వర రావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పైసాబజార్, పి బి మనీ ప్రారంభంతో ఆర్థికాభివృద్ధి బలోపేతం



హైదరాబాద్, మార్చి 21, 2025: ఆర్థిక ఖాతాల ఏకీకృత బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్లు, స్టాక్ పోర్ట్‌ఫోలియోలతో సహా అన్ని ఆర్థిక ఖాతాలను ఒకే డాష్‌బోర్డులో చూడగలిగే సౌకర్యం కలదని వ్యక్తిగతమైన, కార్యాచరణలో మార్గదర్శక సూచనలు: బాగా ఆర్థిక నిర్ణయాలు పోర్ట్‌ఫోలియో నిర్వహణ కోసం సులభతరమైన మార్గాలను అందించడంలో దోహదం చేస్తుందని రాధికా బినాని, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్, పైసాబజార్ అన్నారు . టెక్నాలజీ ఆధారిత పెట్టుబడి సలహాలు: ఆధునిక అల్గోరిథమ్స్ డేటా విశ్లేషణ సాయంతో అనుకూలమైన పెట్టుబడి సూచనలను అందిస్తుంది. ఇండియాలో వినియోగదారుల క్రెడిట్ మార్కెట్‌లో ముందున్న పైసాబజార్, పి బి మనీ అనే వ్యక్తిగత ఆర్థిక నిర్వహణ వేదికను ప్రారంభించినట్లు ప్రకటించింది. వినియోగదారులకు ఆర్థికంగా మెరుగుపరచడానికి సమగ్రమైన అవగాహనలు, సలహాలను అందించడమే ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యమన్నారుపి బి మనీ వినియోగదారులకు సమగ్ర ఆర్థిక అనుభవాన్ని అందించడానికి పైసాబజార్ యొక్క పెద్ద విభిన్న వినియోగదారుల స్థావరంతో మరింత సంబంధాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టిందని, ఇది ఖాతాల సమీకరణ ఫ్రేమ్‌వర్క్ ద్వారా నిర్మించబడింది, ఇతర డేటా సమీకరణలను కలిగి ఉంది. ఇది వినియోగదారులకు బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలు, స్టాక్స్ వంటి మొదలగు ఆర్థిక సమాచారం ఒకే డాష్‌బోర్డులో చూడగలిగే సౌకర్యం అందిస్తుందన్నారు . రాబోయే రోజులలో ఇన్సూరెన్స్ కవరేజ్, జి ఎస్ టి ఫైలింగ్‌ల సమాచారం కూడా దీనిలో చేర్చబడనుంది.ఈ పరిశ్రమలోనే మొదటిసారిగా తీసుకొచ్చిన ఈ ఆవిష్కరణ, వినియోగదారులు తమ ఆదాయం-ఖర్చులను ట్రాక్ చేయడం, పెట్టుబడులను పర్యవేక్షించడం, ఇన్సూరెన్స్ కవరేజ్‌ను అంచనా వేయడం వంటి పనులను సులభతరం చేస్తుంది. దీంతో వారు అర్థవంతమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంది. టెక్నాలజీ ఆధారిత విధానంతో నిర్మించబడిన పి బి మనీ, వినియోగదారుల ఆర్థిక అవగాహన సంక్షేమాన్ని పెంపొందించడానికి మృదువైన, సహజ అనుభవాన్ని అందిస్తుంది పైసాబజార్ పి బి మనీ ప్రారంభించింది: ఆర్థిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడానికి సమగ్రమైన అవగాహనలను అందించడమే లక్ష్యం అని అన్నారు. రాధికా బినాని, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్, పైసాబజార్ అన్నారు. "కన్జ్యూమర్ క్రెడిట్ ప్లాట్‌ఫారమ్‌గా, గత దశాబ్దంలో మేము లక్షలాది మంది వినియోగదారులకు అవగాహన కలిగిన క్రెడిట్ నిర్ణయాలు తీసుకునేందుకు సహాయపడటంతో బలమైన వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించామన్నారు.

## ప్రమాదాలకు కారణమవుతున్నమూలమలుపు వద్ద చెట్ల తొలగింపు



నడికూడ, మార్చి 21 (ప్రుదయం ప్రతినిధి): నడికూడ మండలంలోని కంఠా త్మకూర్ గ్రామంలో మూల మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్నచెట్లను శిక్షణ ఐపీఎస్ మనన్ భట్, దామెర ఎస్ఐ కొంక అశోక్, సిబ్బందిచే తొలగించారు. మలుపుల వద్ద ఉన్న చెట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించ కపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రో డ్డు ప్రమాదాల నివార ణలో భాగంగా జెసీబీ సాయంతో చెట్లను తొల గించినట్లు వారు తెలిపారు.

పరకాల నుండి హనుమకొండ వెళ్లు దారిలో ఉన్న కంఠాత్మకూర్ గ్రామం మూల మలుపు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో పాటు ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన తెలిసిందే


## పోగొట్టుకున్న మొబైల్ ను బాధితునికి అప్పజెప్పిన ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు వారి సిబ్బంది




(గద్వాల మార్చి 21 ప్రుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం, నెట్టెంపాడు గ్రామానికి చెందిన మెకానిక్ పరుష రాముడుకు సంబంధించిన మొబైల్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు పడిపోవడంతో అట్టి ఫోన్ ను ట్రాఫిక్ ఎస్ఐ పెట్రోలింగ్ చేస్తుండగా మొబైల్ ఫోన్ దొరకడంతో పూర్తి వివరాలు తెలుసుకొని బాధితుడు మెకానిక్ పరశురాముడుకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు వారి సిబ్బంది చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడుకి వారి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.

# నాలుగుసార్లు గెలిచి ఏం లాభం...?

## బడ్జెట్ కాపీలు చదివి మాట్లాడాలి... జిల్లాకు కేటాయింపులు తెలుసుకో.. గంగులకు కాంగ్రెస్ నేత పురుమల్ల సూచన



కరీంనగర్ 21 (ప్రుదయం ప్రతినిధి):రాష్ట్ర బడ్జెట్ పై కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన విమర్శలను తిప్పికొడుతూ బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మరుసటి రోజు సెలవు దినం బడ్జెట్ కాపీలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవడానికేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందన్న విషయం మరిచిపోవద్దన్నారు. అన్ని రంగాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిధులను కేటాయించారని అన్నారు. బడ్జెట్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నిధులు కేటాయించారని.. కావాలంటే మరోసారి చదువుకోవాలన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు 2685 కోట్ల కేటాయించారని..శ్రీపాద ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ ఫ్లడ్ కెనాల్ కు రూ.548 కోట్లు కేటాయించారని.. ఉమ్మడి జిల్లాకు సంబంధించినవి కావా అని ప్రశ్నించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కింద 101 కోట్లు కేటాయించారని... శాతవాహన యూనివర్సిటీకి 35 కోట్లు కేటాయించారని.. ఇవి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లేవా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు విద్య, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేసేందుకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు.గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్కరకు రాకుండా పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దాని మరమ్మత్తుల కోసం 2685 కోట్లు బడ్జెట్లో కేటాయించిన సంగతి తెలుసుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచంలోనే అద్భుత ప్రాజెక్టు కట్టామని గొప్పలు చెప్పుకున్న టిఆర్ఎస్ నాయకుల అవినీతి వల్లే కాళేశ్వరం నిరుపయోగంగా మారిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి రూ.249 కోట్లు, ఎస్సారెస్పీ వరద కాల్వకు రూ.299 కోట్లు కేటాయించిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కేటాయించిన నిధులతో పెండింగ్ లో ఉన్న స్టేజీ 2 పనులు పూర్తయ్యే అవకాశ ముందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ టు ఫేజ్ వన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో 1.51,400 ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ఈ నిధులు కేటాయించారని పురుమల్ల శ్రీనివాస్ వివరించారు. గత సర్కార్ హయాంలో నిధుల్లేక నిర్లక్ష్యానికి గురైన శాతవాహన యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించిందని...ఇప్పటికే ఈ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజీ, లా కాలేజీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారన్న విషయం తెలుసుకోవాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో ఎంఫార్మసీ కోర్సుకు కూడా అనుమతులు లభించాయన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఈ నెలాఖరుతో ముగియనున్నదని... ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ గా 101 కోట్లు కేటాయించిందన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పరిధిలో ఇంకా 14పనులు నిర్మాణంలో ఉన్నందున వాటిని పూర్తి చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారన్నారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్ కు 20 కోట్లు కేటాయించారన్నారు. కనీస సౌకర్యాలు లేక అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు బడ్జెట్ ఊరటనిస్తున్న విషయం తెలియదా అని ఆయన నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు ఎంపీగా ఉద్యమించి .. నేడు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి, రెండూ గంగుల కమలాకర్ కు లేవని పురుమల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి మేలు జరగాలనే ఏకైక లక్ష్యంగా కులగణన సర్వేను, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయడంలో పొన్నం ప్రభాకర్ ముఖ్య భూమిక పోషించారని వివరించారు. మంత్రి గా ఐదేళ్ళు ఉన్న గంగుల కమలాకర్ ఏనాడైనా తన శాఖ గురించి మాట్లాడారా అని నిలదీశారు. బీసీల కోసం నిరంతరం తపించే పొన్నం ప్రభాకర్ ను విమర్శిస్తే సూర్యునిపై ఉమ్మేసినట్లే అవుతుందని ఆయన తేల్చిచెప్పారు. బడ్జెట్ లో బీసీ సంక్షేమానికి 11405 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. గత సంవత్సరం 9200 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు పెరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని ఆయన స్పష్టం చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే పనిలో ఉందని ఆయన వివరించారు.

# ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో ఆయురారోగ్యాలు-

## డా: కెప్టెన్: బుర్ర మధుసూదన్ రెడ్డి





హైదరాబాద్,మార్చి21వుదయం (ప్రతినిధి): ధన్వి న్యూట్రిషన్ సెంటర్ 15వ వార్షికోత్సవ సంబరాల సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించిన లయన్: కెప్టెన్: డాక్టర్మ్: బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మన ఆహారపు అలవాట్లతో పాటు స్వల్ప జీవనశైలి మార్పులు చేసుకుంటూ ఆయురారోగ్యాలతో జీవించే కళను అలవర్చుకోవాలని సూచించారు. నేడు ధన్వి న్యూట్రిషన్ సెంటర్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒక ఆరోగ్య సంస్థ 15 ఏండ్లుగా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పిస్తూ పౌరసమాజ మన్ననలు పొందడం హర్షణీయమని అన్నారు. మన శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి న్యూట్రిషనిస్ట్ సలహాలతో పోషకాహారం తీసుకోవాలని, వారు సూచించిన జీవన విధానాన్ని అవలంబించాలని కోరారు. ధన్వి న్యూట్రిషన్ సెంటర్ నిర్వహకులు డి రవిందర్ మాట్లాడుతూ ఒక చిన్న కేంద్రంగా ప్రారంభమై నేడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వందల సెంటర్లతో ప్రజల ఆరోగ్య రక్షణ భాధ్యతలను తాము భుజాన వేసుకొని అహర్నిశలు కృషి చేస్తున్నామని, ఈ సెంటర్ల ద్వారా ఆరోగ్యం పొందిన సభ్యుల కరతాళధ్వనుల నడుమ సంతోషం వ్యక్తం చేశారు. గౌరవ అతిథి ముప్పిడి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను ధన్వి సెంటర్ ద్వారా దాదాపు 20 కెజీల బరువు తగ్గి ఆరోగ్యంగా ఉన్నానని తన వ్యక్తిగత అనుభవాన్ని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ఆరోగ్య సురక్ష పొందిన సభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కేకును కట్ చేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సెంటర్ నిర్వాహకులు న్యూట్రిషనిస్ట్ డి రవిందర్‌తో పాటు పలువురు సెంటర్ సభ్యులు రక్త దాతలుగా తమ సేవానిరతిని ప్రదర్శించారు.

# మానసిక ఆరోగ్యం - న్యాయ పరమైన సమస్యల పై సమీక్ష సమావేశం

## సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ గంటా కవితా దేవి






గద్వాల మార్చి 21 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా ఆసుపత్రి నందు శుక్రవారం జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర ఆధ్వర్యంలో సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ గంటా కవితా దేవి మానసిక ఆరోగ్యం, న్యాయం పరమైన సమస్యలు గురించి, పేషెంట్లకు ట్రైనీ స్టూడెంట్స్ అందరికీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో వారు మాట్లాడుతూ మానసిక రోగులు, బుద్ధి మాధ్యం గల వ్యక్తులు వాళ్ళ యొక్క మానసిక స్థితి వల్ల చాలాసార్లు న్యాయపరమైన హక్కులు వినియోగించుకోలేక పోతున్నారు దానికి కారణం వాళ్ళ యొక్క స్థితి మిగతా వారితో పోలిస్తే భిన్నమైంది. నిర్ణయం తీసుకునే శక్తి పూర్తి స్థాయిలో లేకపోవడం ప్రధాన కారణం. దీనిని దృష్టిలో ఉంచుకొని నాల్సా చట్టం ద్వారా అటువంటి రోగులకు వైద్య బృందం నుండి పూర్తి సహకారం, న్యాయ సేవలు అధికారం ద్వారా లీగల్ సర్వీసెస్ యూనిట్ మనోన్యాయ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా ఈ రోజు మన జిల్లా నందు డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ కే సిద్ధప్ప, ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంధ్యా కిరణ్ మై, డాక్టర్ వృశాలి, ఇన్సిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, మానసిక ఆరోగ్య నిపుణులు ప్రదీప్ కుమార్ కూడా అవగాహన కల్పించారు. అందరూ అధికారులు పాల్గొని సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేశారు.

# రోజు రోజుకి పెరుగుతున్నఎండలు జన సంచారము లేని రోడ్లు



నడికూడ, మార్చి21 (వుదయం ప్రతినిధి) నడికూడ మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత పెరగ డంతో ఉదయం 11 గంటల తర్వాత రోడ్లపైకి ప్రజలు రావడానికి జంకుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలు ఉదయం 6 గంటలకే వెళుతూ మధ్యాహ్నం వరకు ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని రోడ్లు, వీధులు అన్ని బోసిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే రెండు నెలలు ఇంకెత ఎండలు ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



రంగారెడ్డి జిల్లా మార్చి21(వుదయం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా బుద్వేల్ గ్రామ పరిధిలో కేటాయించిన 15 ఎకరాల స్థలంలో రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రెడ్డి హాస్టల్, విద్యాసంస్థల భవన సముదాయాల పనులను వేగవంతంచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకుసూచించారు. శుక్రవారం బుద్వేల్ లో 13.63 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నిర్మాణాలపనులను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ 10 కోట్ల రూపాయలను ఓడిఎఫ్ నిధుల కింద మంజూరు చేయడంజరిగిందని, మిగతా మూడు కోట్ల 63 లక్షలు సొసైటీ తమ వాటాగా నిధులు విడుదలచేసిందని తెలిపారు. పనులు గత కొంత కాలంగా నిలిచిపోవడానికి గల కారణాలనుసంబంధిత కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కాంట్రాక్టర్‌పనులు చేయకుండా నిలుపుదల ఎందుకు చేశారో తెలపాలని కలెక్టర్ అన్నారు.ఇప్పటికైన పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు కాంట్రాక్టర్లకుసూచించారు. ఈ కార్యక్రమంలో రాజ బహుదూర్ వెంకట్రాంరెడ్డి, ఎడ్యుకేషనల్ సోసైటీ అధ్యక్షులు వెంకట్ రంగారెడ్డి, సెక్రటరీ మోహన్ రెడ్డి, ఈ ఈ పంచాయతీరాజ్‌రామకృష్ణ, డి.ఈ ఖలీముద్దీన్ తదితర రెడ్డి సంఘ సభ్యులు, రాజేంద్రనగర్‌ఎమ్మార్వో రాములు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 21(వుదయం ప్రతినిధి) వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ తగలడానికి గల ప్రధాన కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టి, ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు సమావేశంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల వాల్ పోస్టర్లను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య పరంగా వడదెబ్బ నుండి సురక్షితంగా ఉండడంతో పాటు ప్రాణ నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు. ముఖ్యంగా వేడిని తట్టుకోలేని చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటలకు బయటికి రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని, చేయాల్సి వస్తే ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి తెలిపారు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు, ఎండ తగలకుండా తల కవరయ్యే విధంగా టోపి, కండువా, గొడుగు లాంటివి ధరించాలని అన్నారు. ఉపాధి హామీ పదకం పనులు జరిగే ప్రాంతాల్లోకూలీలకు నీడ సౌకర్యం, ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఏదేని అస్వస్థతకు గురైతే అలసత్వం వహించగా తక్షణ వైద్య సేవలు తీసుకోవాలని సూచించారు. నిల్వ పదార్థాలు తినొద్దని, సాధ్యమైనంత వరకు బయటి పదార్థాలు, వేపుళ్ళు వంటివి తగ్గించుకోవాలన్నారు. అత్యవసర సేవలకు 108, 102 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రక్షణ చర్యలపై కార్మికులకు, వాహన డ్రైవర్లుకు, ఆయా శాఖల సిబ్బందికి, తద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పశువుల సంరక్షణ కూడా చాలా ముఖ్యమని వాటిని ఎండ నుండి కాపాడుకోవాల్సిన భాద్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, డిపిఓ నారాయణరావు, ఎన్సీడీ పిఓ డా రవి రాథోడ్,రవాణాశాఖ అధికారి మహ్మద్ సంధాని, వ్యవసాయ అధికారి వీరు నాయక్, సహాయ కార్మిక అధికారి వినోద, సిపిఓ బాబురావు, పశుసంవర్ధక శాఖ అధికారి డా కుమార స్వామి, డా ఉమాదేవి, డా సందీప్, డా శ్రీకాంత్, డా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



హనుమకొండ, మార్చి 21(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు. పరీక్ష కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. వార్షిక పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు అనే వివరాలను, పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపునకు సంబంధించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు. లిచలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్‌లి పున్నేలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేసవికాలం దృష్ట్యా పాఠశాల ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చలివేంద్రం నిర్వహణ బాగుండేలా చూసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి సునీల్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, స్థానికులు పాల్గొన్నారు.

# మరికల్ ఐ బజార్ వేలం పాట



మరి కల్ మార్చి21(వుదయం ప్రతినిధి): మండల కేంద్రంలోని శుక్రవారం గ్రామ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేలంపాట ప్రతి సంవత్సరం 2025బి2026 సోమవారం నాడు గ్రామపంచాయతీలో నిర్వహించబడుతుంది గ్రామస్తులు వేలం పాడడానికి 50వేల రూపాయలు డిడి రూపంలో డిపాజిట్ చేసి వేలం పాడడానికి రావాలని ఆయన అన్నారు వేలం పాటలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన గ్రామస్తులకు సూచించారు

# కోదాడలో నాభి శిలా బొడ్రాయి ఏడవ వార్షికోత్సవం.



కోదాడ టౌన్ మార్చి21(వుదయం ప్రతినిధి): కోదాడ పట్టణంలో గ్రామ దేవత నాభి శిల బొడ్రాయి ఏడవ వార్షికోత్సవం శుక్రవారం కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలని కనుల పండువగ జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బిందెలతో జలాభిషేకాలు జరిపి బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి బొడ్రాయి వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు,శ్రీదేవి దంపతులు పీటలపై కూర్చొని బొడ్రాయి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి జలాభిషేకాలు జరిపి అమ్మవారికి తొలి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. పట్టణ నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి రావడంతో బొడ్రాయి వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పున ప్రతిష్ట కమిటీ సభ్యులు, ముత్యాలమ్మ కమిటీ, రైతు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ఐనవోలు పీహెచ్ సీని తనిఖీ చేసిన కలెక్టర్



హనుమకొండ, మార్చి 21(వుదయం జిల్లా ప్రతినిధి) : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.

శుక్రవారం రోజున హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్, మెయింటెనెన్స్ రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కొందరు సమావేశానికి హనుమకొండకు వెళ్ళగా కలెక్టర్ ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ రావును అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల డబ్బాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సబ్ సెంటర్ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య సేవల కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



నారాయణపేట టౌన్ మార్చి 21( వుదయం ప్రతినిధి)నారాయణ పేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ (గ్రౌండ్ ) ఉన్నత పాఠశాలలో గల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేసిపదో తరగతి పరీక్ష సరళని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తొలి రోజు పరీక్షకు వచ్చిన విద్యార్థుల శాతం ఎంత అని పరీక్షా కేంద్రం సీ ఎస్ విశ్వనాథ్ ను అడిగగా వంద శాతం నమోదు ఉందని ఆయన కలెక్టర్ కు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# ప్రభుత్వ భూముల పరిశీలన...

## జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



కోరుట్ల మార్చి 21 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణంలో గల సర్వే నెంబర్ 1304 లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 923 లో 30 ఎకరాలు ప్రభుత్వ భూమినీ శుక్రవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు కోరుట్ల ఆర్డిఓ జీవాకర్ రెడ్డి ఎంపీడీవో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ నాయక్ తాసిల్దార్ సర్వేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి తొలి రోజు పరీక్ష

**మొత్తం 2343 మందికి 2339 మంది హాజరు. నలుగురే గైర్హాజరు**

**మొత్తం 99.82 శాతం విద్యార్థులు హాజరు**

**పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించిన పోలీసులు**



కోదాడ టౌన్ మార్చి 21(వుదయం) కోదాడ పట్టణంలో 10వ తరగతి తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ పేర్కొన్నారు. మొత్తం 11 సెంటర్లలో 2343 మందికి గాను 2339 మంది హాజరై కేవలం నలుగురే గైర్హాజరైనట్లు తెలిపారు. 99.82 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కోదాడ టాలెంట్ స్కూల్ పరీక్ష కేంద్రం అడ్రస్సు తప్పుగా వంుద్రి%శీ%చబడినప్పటికీ విద్యార్థులందరికీ సరైన అవగాహన కల్పించడంతో ఆ సెంటర్లో వంద శాతం విద్యార్థులు హాజరయ్యారు. ప్రతి సెంటర్లో సిట్టింగ్స్ స్వాడ్లను నియమించరన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారని తెలిపారు.

# ఈ నెల 27న ఆర్య వైశ్య జిల్లా మహాసభ

ఆదిలాబాద్, మార్చి21(వుదయం ప్రతినిధి): ఈ నెల 27న ఆర్య వైశ్య జిల్లా మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సంగం నాయకులు మాజీ మంత్రి జోగురామన్న ఆదిలాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. నార్నూర్ లో నిర్వహించే వేడుకకు హాజరుకావాలని మాజీ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

మాజీ మంత్రిని కలిసిన వారిలో జిల్లా నూతన అధ్యక్షులు చింతావార్ రాజేశ్వర్, ప్రతినిధులు జనగం దినకర్, మల్లుర్వార్ చంద్రకాంత్, రాజేశ్వర్, క్రాంతి ఉన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఏపూరి తిరుపతమ్మ



కోదాడ రూరల్ మార్చి 21(వుదయం) కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి ఆర్థిక సహకారంతో జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిర కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఏపూరి తిరుపతమ్మ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులందరూ ఉచిత పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని పశువులలో వచ్చే వివిధ రకాల వ్యాధులకు సరైన చికిత్స పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్, కార్యదర్శి బీవీ రాహుల్ డైరెక్టర్లు కునుకుంట్ల శ్రీనివాసరావు, రాపాని శ్రీను,జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డా. శ్రీనివాసరావు , డా. సురేంద్ర, డా. మధు , పశువైద్య సిబ్బంది అరుణ, శ్రీను ప్రసాద్,ఆదినారాయణ మాజీ సర్పంచ్ సాదినేని లీలావతి అప్పారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల బంగారు భవిష్యత్తు, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దేవే ప్రభుత్వ పాఠశాలలు .



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 21 వుదయం ప్రతినిధి: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు క్రమశిక్షణ కల్గిన పౌరులుగా తీర్చిదిద్దేవే ప్రభుత్వ పాఠశాల అని రాజాపేట ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సట్టు జయంత అన్నారు. శుక్రవారం నెమిల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తి చెంది పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం పౌష్టికహారం అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజు పేద పిల్లలకు రాగి జావా, కోడిగ్రుడ్లు అందించేలా ప్రాధనోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవడం పట్ల అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమ్మిలిత విద్య తో పాటు రవాణాభత్యం, స్టైఫండ్, రీడర్ సదుపాయాలు, సహాయాపకారణాలు ప్రభుత్వము అందిస్తుందన్న విషయాల పై అవగాహన కల్పించినారు. రికార్డులను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నెమిల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ ఉపాధ్యాయులు మమత, భార్గవి, రజిత, సుజాత క్లస్టర్ రీసోర్స్ పర్సన్ జమాల్పురం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి బృందం.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 21 వుదయం ప్రతినిధి: రాజపేట మండలంలోని మూడు ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను మొదటిరోజు శుక్రవారం తెలుగు పరీక్ష సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి బృందం ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాజపేట ఎస్సై అనిల్ కుమార్ రఘునాథపురం రాజపేటలోని పరీక్షా కేంద్రాల పరిసరాలను పోలీసు బృందంతో కలిసి పరిశీలించారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గుర్తు చేశారు. ఓడు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు బాలికలు గైర్హాజరైనట్లు ఎంఈఓ చందా రమేష్ తెలిపారు.

అందులో ఒకరు ఇటీవల మృతి చెందాగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరీక్ష రాసేందుకు సెంటర్ లోకి వెళుతున్న సమయంలో ప్రతి విద్యార్థిని ఎంఈఓ చందా రమేష్ బృందం చెక్ చేశారు.

## నర్సాపూర్ జి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు

నిర్మల్, మార్చి21(వుదయం ప్రతినిధి): నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన గాంధారి భోజవ్వ-భూమన్న (ఆర్టీసీ ఉద్యోగి) దంపతులకు కుమారుడు గాంధారి సూర్యతేజ రెండు ప్రభుత్వ కొలువులు సాధించారు. మిషన్ భగీరథలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలను సాధించి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. శుక్రవారం యువకుడిని గ్రామస్థులు కుటుంబ సభ్యులు అభినందించారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

సిరిసిల్ల, మార్చి21(వుదయం ప్రతినిధి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును ఇతర స్థాయిలో పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి.

# తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల విలీన సభను జయప్రదం చేయండి

### -గుగ్గిళ్ళ వెంకన్న, ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు

కొత్తగూడ మార్చి 21(వుదయం ప్రతినిధి ):తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల మరియు మున్సిపల్ కార్మికుల రాష్ట్ర విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో కొత్తగూడ గంగారం మండలాలకు సంబంధించిన తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ కార్మికుల ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ




వెంకన్న తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత నిర్లక్ష్యాన్ని వహిస్తూ వారికి రావలసిన బెనిఫిట్స్ను అందించడంలో జాప్యం చేస్తుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం రెండు కార్మిక సంఘాలు విలీనం కావడం జరుగుతుందని వారు అన్నారు.ఈ నెల 27న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగు ఆదర్శ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం, మరియు ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సంఘాల విలీన సభను గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఇఫ్ట్ ఏరియా నాయకులు పసునూరి రాజమల్లు, ఐలబోయిన నరేష్, బానోత్ మోహన్, వెంకన్న, గట్టి సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

# మునగ సాగు తో రైతులు అధిక లాభాలు పొందవచ్చు

### అడిషనల్ కలెక్టర్ విద్యా చందన



మార్చి 21 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మల్లారం రైతు వేదికలో అశ్వరావుపేట దమ్మపేట మండల రైతులకు మునగసాగు పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ కలెక్టర్ ఎం, విద్యాచందన, పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 ఎకరాలు ఉన్న చిన్న రైతులు మరియు 10 ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరానికి ఒక లక్ష పదివేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం ద్వారా అందజేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు అదే విధంగా మునగ పంటకు ఎక్కువ ధర ఉండడమే వలన మునగ సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని అదేవిధంగా మునగాకు కూడా చాలా విలువైనదని ఆమె తెలియజేశారు ప్రతి రైతు ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం, ఫ్రం, పౌండు చేసుకొని చేపల పంపకం చేపట్టాలని మరియు మునగ ఫారం పండ్లు ఎక్కువ మొత్తంలో రైతులు ముందుకు వచ్చి సాగు చేసుకోవాలని తద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని ఆమె తెలియజేశారు అదే విధంగా ఉపాధి హామీ పథకం ద్వారా గేదలు కోళ్ల షెడ్డులు నిర్మించుకోవాలని ఇంకుడు గుంతలు ప్రతి ఇంటికి చేసుకోవాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అధికారి బాబురావు మాట్లాడుతూ పామాయిల్ రైతులందరూ అంతర పంటగా మునగ సాగు చేపట్టాలని ఫార్మా పౌండు రైతులందరూ సాగు చేసుకోవడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డివిజన్ అధికారి రవికుమార్, దమ్మపేట ఎంపీడీవో బి రవీందర్, రెడ్డి అశ్వరావుపేట ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,దమ్మపేట ఎంపీ ఓ రామారావు, ఏపీఓ వి సుధాకర్ రావు, దమ్మపేట పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# టీబీ వ్యాధిపై ప్రజలందరికి అవగాహన.





ధర్మసాగర్ మార్చి21(వుదయం ప్రతినిధి): మార్చి 24 తేదీ న ప్రపంచ క్షయ ఘవ్యాధి దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో. ధర్మసాగర్ పి హెచ్ సి వైద్య అధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ, ఎండ్ టిబి- 2025 కార్యక్రమం లో భాగంగా గ్రామ ప్రజలందరికీ అవగాహన కలిగి ఉండాలని, క్షయవ్యాధిని నిర్మూలించడంలో ప్రజలంతా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, ఆకలి తగ్గిపోవడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వారు వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయినట్లయితే టీబి మందులు ఆశా వర్కర్ల ద్వారా ఇప్పించడం జరుగుతుంది. టీబీ వ్యాధికి నిర్ధారణ పరీక్షలు మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తారని తెలిపారు. దీనితోపాటు టీబి మందులు వాడుతున్న వారికి పోషకాహార సహాయం కింద నెలకు 1000 రూపాయలు చొప్పున ఆరు నెలల కాలానికి అందిస్తారని తెలిపారు. ఇటువంటి అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని టీబీ వ్యాధిని నిర్మూలించడంలో ప్రజలంతా తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యప్రకాశ్, కరుణాకర్ , జాతీయ టిబి నివారణ విభాగం సిబ్బంది సతీష్ కుమార్, కోఆర్డినేటర్ దూడం నగేష్ , ఏఎన్ఎంలు ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్




మార్చి 21 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): జాతీయ ఆరోగ్య మిషన్ పథకాన్ని రెగ్యులర్ చేయాలని, ఆశ వర్కర్లను కార్మికులకు గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పట్వారిగూడెం దమ్మపేట పి హెచ్ సి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు కృషి వల్ల మలేరియా మాత శిశు మరణాలు రేటు తగ్గుదలలో ఆశాల పాత్ర చాలా కీలకంగా ఉందని ,ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖకు సంబంధించి అన్ని ప్రచారాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో ఆశా కార్మికులు ముఖ్యమైన పాత్ర వహిస్తున్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఆశా కార్యకర్తల వేతనం పెంచాలని వారి సమస్యలు పరిష్కరించాలని అనేక ఆందోళన ఫలితంగా వారం క్రితం కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో మాట్లాడుతూ త్వరలో ఆశల ప్రోత్సాహాలు పెంచే విధంగా కృషి చేస్తామని చెప్పి నేడు రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆషా లకు ప్రోత్స హాలు పెంచే విధానం లేదని ఇప్పుడు ఇస్తున్నది మంచి వేతనాలని మోడీ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు అద్భుతమైన ప్రోత్సాహాలు అందిస్తుందని అనడం హాస్యప్పదమని ఆశా కార్యకర్తలు కు పొందుతున్న వేతనంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది కేవలం 1200 మాత్రమేనని అన్నారు. ఆశా కార్యకర్తలకు పనివేళలో వారికి భద్రత కల్పించాలని ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొప్పుల శ్రీను ,ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి శారద,శ్రీలత,నాగమణి,మహాలక్ష్మి ప్రమీల, మనీ,సుజాత, రమణ, వరలక్ష్మి,సంధ్య, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ.



యాదాద్రి భువనగిరి/ రాజాపేట, మార్చి 21 వుదయం ప్రతినిధి: రాజపేట మండల కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉచిత ఉపకారణాలను భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం ఐ. ఈ. ఆర్. టి. సంధ్యారాణి వివరాలు చెప్పారు. ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా విద్యాధికారిలు యివ్వగా సహిత విద్యా కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నడవలేని పిల్లలకి కాలిపర్స్ రోలేటర్స్ ట్రై సైకిల్ ఇతరులకు బ్రెయిలీ కిట్టులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమానికి దివ్యాంగ విద్యార్థులు తల్లిదండ్రులు బోధిస్తున్న ఇంక్రీజ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ పర్సన్స్ హాజరైనట్లు చెప్పారు. కలెక్టర్ చేతుల మీదుగా పరికరాలు అందుకోవడం సంతోషంగా ఉందని పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు చెప్పారు

# జలం లేనిదే జీవం లేదు....

### ఆర్థిక సామాజిక విశ్లేషకులు బడుగుల సైదులు.



కోదాడ టౌన్ మార్చి 21(వుదయం)నేడు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సామాజిక ఆర్థిక విశ్లేషకులు బడుగుల సైదులు తన అభిప్రాయాలను వుదయం తో పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి లక్ష్యం 2030 నాటికి అందరికీ మంచినీరు, పారిశుద్ధ్యం అనే సుస్థిర అభివృద్ధి సాధన కోసం ప్రతి ఒక్కరం, ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి వృధా చేయకుండా, అవసరానికి తగ్గట్టు ప్రతిరోజు నీటి వినియోగంలో మార్పులు చేసుకోవాలని కోరారు. ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ హిమానీ నదాల సంరక్షణ సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. మంచినీటి ప్రాధాన్యతను గుర్తించి ప్రపంచ నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. త్రాగునీరు, వ్యవసాయం, పరిశ్రమ స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తి ఆరోగ్యకరమైన పర్యావరణం పరిశుభ్రత అవసరమని తెలిపారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం పారిశుద్ధ్యం పరిశుభ్రమైన నీరు లేకపోవడం వలన కలిగే వ్యాధుల కారణంగా ప్రతి సంవత్సరం 14 లక్షల మంది మరణిస్తున్నారని ,ప్రపంచంలో దాదాపుగా 25 శాతం మందికి పరిశుభ్రమైన నీరు అందుబాటులో లేదన్నారు. నీటిని అవసరానికి మించి ఉపయోగించకుండా, నీటి నష్టాన్ని, నీటికాలుష్యాన్ని నివారించడం పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారానే భూమిపై సకల ప్రాణుల మనుగడ సాధ్యం అన్నారు

## ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు

బోథ్, మార్చి21(వుదయం ప్రతినిధి): ఆదిలాబాద్ లో పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు హాల్ టికెట్లను పరిశీలించి విద్యార్థులను అనుమతించారు. జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 10, 051 మంది విద్యార్థులు పరీక్ష రాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉదయం 9: 30 నుండి మధ్యాహ్నం 12: 30 వరకు పరీక్ష కొనసాగుతుంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది.

## గ్రామాలలోని నర్సరీలను పారిశుధ్య పనుల పరిశీలన.

### జిల్లా పంచాయతీ అధికారిని కల్పన.





ఖానాపురం మార్చి 21 వుదయం ప్రతినిధి.మండల కేంద్రంతోపాటు రాగంపేట, రంగాపురం గ్రామాల్లోని నర్సరీలను, పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారిని కటకం కల్పన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారిని మాట్లాడుతూ గ్రామాల్లోని పారిశుధ్య పనులను నర్సరీలను ప్రతిరోజు పరిశీలించాలని అలాగే గ్రామాల్లోని త్రాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించుకుంటూ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల నర్సరీలలోని మొక్కల కొసలు ఎండిపోవడం జరుగుతుందని ప్రతిరోజు సిబ్బందిచే మొక్కలకు నీటిని అందించాలని కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో సునీల్ కుమార్ రాజ్, కార్యదర్శులు సట్ల సుప్రజ, అబేద, మాలతి జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెడదాం

జనగామ, మార్చి21(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా కొడకండ్ల మండల పరిధిలోని నర్సింగాపురం గ్రామం నుండి శుక్రవారం గౌడ సంఘం అధ్యక్షుడు కప్పల లింగయ్య ఆధ్వర్యంలో జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని దీక్షలో కూర్చోడానికి కొంతమంది గౌడ కులస్తులను దీక్ష శిబిరానికి తరలుతున్నారు.

గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ, జై కొడుతూ నినాదాలు చేస్తూ శిబిరానికి వెళుతున్న దృశ్యం కనిపిస్తుంది.

## అడవులను కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత.

### ఏఎస్ ఆర్ సంస్థ ప్రతినిధి రాజశేఖర్.



ఖానాపురం మార్చి 21 వుదయం ప్రతినిధి.అడవులను కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏ ఎస్ ఆర్ సంస్థ ప్రతినిధి ఎర్రబోయిన రాజశేఖర్ అన్నారు, ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సమైక్య ఆధ్వర్యంలో మండలంలో అశోక్ నగర్ శివారు పాకాల పరిసర ప్రాంతాలలోని బయోడైవర్సిటీ పార్క్ పరిసరాలలోని వనదర్శిని కార్యక్రమంలో భాగంగా సైనిక్ స్కూల్ ఎన్ సి సి విద్యార్థులకు పర్యావరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ రీనా, సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, జిల్లా వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగం, సైనిక్ స్కూల్ పీఈటి వెంకటేష్, పాఖల బేస్ క్యాంపు ఇన్చార్జి విజయ్, శివ, వెంకట్రామ నరసయ్య సైనిక్ స్కూలు ఎన్ సీ సీ విద్యార్థులు అటవీ శాఖ సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కు భిన్నంగా ఉన్న బడ్జెట్.

## చింతకింది కుమారస్వామి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి.

నర్సంపేట మార్చి21(వుదయం ప్రతినిధి):



నర్సంపేట మేరు భవన్ లో కమ్మాల వెంకన్న అధ్యక్షతన జరిగిన నర్సంపేట మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ బీసీల ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం ప్రతీ సంవత్సరం 20 వేల కోట్ల చొప్పున రాబోయే ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ 2024-25 బడ్జెట్లో కేవలం 9200కోట్లే కెటాయించారు. ఈ 2025-26 బడ్జెట్లో గత కెటాయింపులలో దేనికి ఎంత ఖర్చు చేసారో చెప్పకుండానే కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్న కెటాయింపులకు గత సంవత్సరం 11200కోట్లు తక్కువ కెటాయించారు. ఈ బడ్జెట్లో 11405 కోట్లు మాత్రమే కెటాయించి 8595 కోట్లు కోత పెట్టారు. ఈ కెటాయింపుల్లో నుంచి దాదాపు 90శాతం నిధులు ఫీజు రీయింబర్స్మెంట్ తదితరాలకే ఖర్చవుతాయి. అలాంటప్పుడు కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన మిగతా హామీలైన ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42% రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్ కు తగినన్ని నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హెూదాతో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు, బీసీల సంక్షేమం కోసం ఎంబీసీ కులాల అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్య కోసం రూపాయలు 10 లక్షల వరకు పూచికత్తులేని వడ్డీ లేని రుణాలు అన్ని జిల్లా కేంద్రాల్లో 50 కోట్లతో కన్వెన్షన్ హాల్ ప్రెస్ క్లబ్ స్టడీ సర్కిల్ లైబ్రరీ క్యాంటీన్లతో కూడిన ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యత భవనాలు, బిసి ఐక్యత భవనాలలోనే జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయం, ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాలతో సమానంగా బీసీలకు ఒక కొత్త గురుకులం ప్రతి జిల్లాలో ఒక కొత్త డిగ్రీ కళాశాల, 3 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయం గల బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్, ఇప్పటివరకు విద్యా సంవత్సరం అయిపోయి అయ్యినప్పటికీ విద్యకు సంబంధించి ఇచ్చిన హామీలు నెరవేర్చడానికీ ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు. వృత్తి బజార్ పేరుతో ప్రతి మండలంలో 50 దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి మంగలి వడ్రంగి చాకలి కమ్మరి స్వర్ణకారుల వంటి చేతివృత్తుల వారికి ఉచితంగా షాపు స్థలాలు అందిస్తామన్నారు. గీత కార్మికులు మరియు చేనేత కార్మికులకు ప్రస్తుతం ఉన్న 50 ఏళ్ల వృద్ధాప్య పింఛన్ అర్హత వయసునే మిగతా అన్ని చేతివృత్తులు చేస్తున్న వారికి వర్తింప చేస్తామన్నారు. ఇచ్చిన హామీల ఒకటి నెరవేర్చలేదు మీరు కామారెడ్డి సభలో ఇచ్చిన ప్రతి హామీని అమలు పరచాలని చింతకింది కుమారస్వామి డిమాండ్ చేస్తూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు లేనియెడల ప్రజాగ్రహాన్ని చవిచూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల సాంబయ్య,బర్ల సందీప్, రామగిరి రవికుమార్,కంద వెంకటేశ్వర్లు ,పద్మ,కమ్మాల అరుణ,మండల శ్రీలత,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధన కోసమే ఒకే దేశం.. ఒకే ఎన్నిక.

## జెమిలి ఎన్నికలతో దేశం మరింత అభివృద్ధి.
## అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్ విధానాలు.
## బిజెపి జిల్లా నాయకులు పాశం భాస్కర్ స్పష్టీకరణ.






యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 21 వుదయం ప్రతినిధి: రాజపేట మండల కేంద్రం లోని గెస్ట్ హౌస్ లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం యొక్క కార్యశాల ఏర్పాటు శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు పాశం భాస్కర్ గారు పాల్గొని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల అభిప్రాయ సేకరణ కోసం మాజీ రాష్ట్రపతి రాం నాథ్ కోవిధ్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జమిలి ఎన్నికలతో దేశం మరింత అభివృద్ధి పదం లో ముందుకు పోతుంది అని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ అనుకూల కార్యక్రమాలకు ఎప్పుడు వ్యతిరేకంగా ఉంటుంది అన్నారు. అంబేద్కర్ కూడా జమిలి ఎన్నికలతోనే దేశం అభివృద్ధి చెందుతుంది అని విశ్వసించే వారు అని అన్నారు. దేశ స్వాతంత్రం తర్వాత జరిగిన ఎన్నికలు జమిలి పద్ధతి లోనే జరిగేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క అధికార దాహం తో ఆ జమిలి వ్యవస్థను విచ్చినం చేసారని తెలిపారు. పార్టీలకి అతీతంగా జమిలి ఎన్నికల పైన ఉన్న సందేహాలు నివృతం చేయాలని సూచించారు.

వన్ నేషన్ వన్ ఎలెక్షన్ తో దేశం ఆర్థిక పురోగతిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ అధ్యక్షతన జరగగా మేకల రమేష్ మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ చాపురం శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల నరసింగరావు, కంచర్ల శ్రీనివాస్ రెడ్డి , బిజెపి ఎస్టి సెల్ రాష్ట్ర నాయకులు బుక్యా శ్రీను నాయక్ , జిల్లా కౌన్సిల్ మెంబర్ పుట్ట వీరయ్య దాచేపల్లి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా నాయకులు బూరుగు శేఖర్ రెడ్డి, రాజం నగేష్ యాదవ్ ,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మెండు భగవాన్ రెడ్డి, మండల బీసీ మోర్చా అధ్యక్షులు కాకళ్ల నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షులు మార్క శివ, దిడ్డి సత్యనారాయణ, చిగుళ్ల బీరప్ప, జెన్నె సిద్ధులు, బిమాగాని శివ, బూరుగు వెంకట్, దండే సంపత్, రంగ నరేష్ గౌడ్, సంగెం వేణు, ఐరేని శ్రీధర్, పోచంగల్ల బాబు, ఉప్పరీ మల్లేశం, కోయ ఉపేందర్, బొమ్మగాని రవికుమార్, పిట్టల పోషయ్య, తదితరులు పాల్గొన్నారు. టిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల బీజేపీలో చేరగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ కి అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు : జిల్లా ఎస్పీ



మెదక్, ( 2025 మార్చ్ 21 వుదయం ప్రతినిధి : యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్‌లకు అలవాటు పడి, సైబర్ మోసగాళ్ళు పన్నిన ఉచ్చులో పడి, డబ్బులు కోల్పోయి అప్పులపాలై, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడిన, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడిన, ప్రోత్సాహించిన అట్టి వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ లకు బానిసలుగా మరి, అప్పులపాలై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని, ముఖ్యంగా సోషల్ మీడియా ఇన్ఫ్లుఎన్సర్లు సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువత దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ఆన్లైన్ బెట్టింగ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గారు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసే ఇన్ఫ్లుఎన్సర్లు పై, కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లు నిర్వహకుల సూచనల మేరకే ఆపరేట్ చేయబడతాయని, బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ వేర్ ఉందని, ఫెక్ లింక్స్ తో వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని, గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ఎవరిపైనా ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదని, జిల్లా ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి, మీ చుట్టూ ప్రక్కల ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 100 డైల్ లేదా మీ సమీప పోలీసు స్టేషన్ నందు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుంది అన్నారు.

## మార్కుల పేరుతో పిల్లలపై ఒత్తిడి పెంచకండి. మానసికంగా దృఢంగా ఉండేటట్టు చూడండి.


### నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి.



నర్సంపేట వుదయం ప్రతినిధి మార్చి 21. నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులందరికీ ఆల్ ద బెస్ట్ తెలిపారు తదుపరి వారు మాట్లాడుతూ పరీక్షలను బాధ్యతతో రాయాలి, కానీ భయంతో కాదని, ఏకాగ్రతతో చదివి, అత్యుత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై, మీ తల్లిదండ్రులకు పేరు తేవాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిచారు. వారి తల్లి తండ్రులు వారి బిడ్డలను మార్కుల పేరుతో ఒత్తిడి చేయకుండా వారిని మానసికంగా దృఢంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గానికి చదువుకున్న విద్యాలయానికి మంచి గుర్తింపుని తీసుకురావాలని కోరారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల పరిశీలన...

## జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్



జగిత్యాల మార్చి 21 (వుదయం ప్రతినిధి) జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హై స్కూల్ పురానణి పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోరుట్ల పట్టణ ఎస్ ఎఫ్ ఎస్ ప్రైవేట్ హై స్కూల్లో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రలను లను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు జిల్లాలో మొత్తం 11,855 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వీరి కోసం 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతత వాతావరణంలో జరుగుతున్నాయని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తోపాటు జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్ జిల్లా విద్యా శాఖ అధికారి రాము ఎమ్మార్వో రామ్మోహన్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# విద్యాశాఖకు కనీసం 15% బడ్జెట్ కేటాయించాలి...

## : ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నాగేష్




కుత్బుల్లాపూర్, మార్చి 21,(వుదయం ప్రతినిధి ),అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా బాచుపల్లి శాఖ చైతన్య కాలేజీలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖకు రాష్ట్ర ప్రభుత్వం 23,108 కోట్లు అంటే 7 శాతం ఇవ్వడం సిగ్గుచేటు అని ఇతర రాష్ట్రాల్లో చూసుకున్నట్లయితే 12 - 13 శాతం బడ్జెట్ విద్యాశాఖకు ఇస్తున్నారని దీన్ని బట్టి చూస్తే మన రాష్ట్ర ప్రభుత్వానికి విద్యాశాఖ పై ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందని అన్నారు. ఈరోజు రాష్ట్రంలో పాఠశాలల నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులు ఎన్నో సమస్యలకు గురవుతున్నారని,

విద్యాశాఖ గురించి పట్టించుకునే విద్యశాఖ మంత్రిని కూడా నియమించలేకపోతున్నారని ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంకా సర్టిఫికెట్లు రాక ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారని రాష్ట్రంలో దాదాపు 8 వేలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ పెండింగ్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నిద్ర మేల్కొని విద్యాశాఖ మంత్రిని నియమించి పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేసి విద్యాశాఖకు సంబంధించినటువంటి బడ్జెట్ ను 7% నుండి15% కు పెంచాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందని లేని పక్షాన అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



మెదక్, ( 2025 మార్చ్ 21 వుదయం ప్రతినిధి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ, వి ఎస్ టి ఇండస్ట్రీస్ తూప్రాన్ వారి సహకారంతో... మల్లారెడ్డి హాస్పిటల్ సూరారం మేడ్చల్ జిల్లా వారి సౌజన్యంతో మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామ పంచాయతీ భవనంలో శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య శిబిరమును మనోహరాబాద్ ఎంపీడీవో కృష్ణమూర్తి ప్రారంభించారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఆరోగ్య శిబిరంలను నిర్వహిస్తూ పేదలకు సేవలు అందించడం పట్ల ఎంపీడీవో హర్షం వ్యక్తం చేశారు జిల్లా ఉప వైద్యాధికారి జ్ఞానేశ్వర్, మనోహరాబాద్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సిహెచ్ ఓ బాల నరసయ్య,
వి ఎస్ టి కంపెనీ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ గోపికృష్ణ తదితరులు వైద్య శిబిరాన్ని సందర్శించారు. మల్లారెడ్డి హాస్పిటల్ ప్రత్యేక వైద్య బృందం గ్రామానికి చేరుకొని ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించింది. అంతేకాకుండా రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో సుమారు 170 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వారిలో డాక్టర్లు మణికంఠ, ఖ్యాతి ,సంజన, రాకేష్ దంత పరీక్షలు నిర్వహించారు, సాయికిరణ్, యశస్విని లు నరాలకు సంబంధించిన కీళ్ల నొప్పులు, దగ్గు, దమ్ము రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమం లో మెదక్ జిల్లా చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర సభ్యులు సింగం శ్రీనివాసరావు, కార్యదర్శి టి.సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి.శ్రీనివాస శర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు పి.దామోదర్ రావు, దేమేయాదగిరి, మద్దెల సత్యనారాయణ, సభ్యులు తోట శ్రీనివాస్ గుప్తా, వి. సతీష్ రావు తో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు. మండల విద్యాశాఖ అధికారిని శ్రీదేవి.




ఖానాపురం మార్చి 21 వుదయం ప్రతినిధి.పదవ తరగతి ఫైనల్ ఎగ్జామ్స్ మండలంలోని బుధరావుపేట గ్రామ శివారు ఆదర్శ పాఠశాలలోని సెంటర్లోని 222 మంది విద్యార్థులకు 222 విద్యార్థులు పరీక్షలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు మండల విద్యాశాఖ అధికారిని డి శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిని మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయాందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో ఫైనల్ ఎగ్జామ్ పరీక్షలు ఓర్పు సహనంతో ఉన్న టైంలో పరీక్షలు వ్రాయాలని విద్యార్థులకు ఎంఈఓ తెలిపారు.

# నర్సింగ్ విద్యార్థులకు తరగతులు నిర్వహణకు తాత్కాలికంగా ఆయుష్ భవనం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 21(వుదయం ప్రతినిధి) నర్సింగ్ విద్యార్థులకు తరగతులు నిర్వహణకు తాత్కాలికంగా ఆయుష్ భవనం వినియోగించడానికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య, నర్సింగ్, ఆయుష్, సీహెచ్‌సీ, టీజీఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ భవనంలోని రెండు అంతస్థులను నర్సింగ్ కళాశాల నిర్వహణకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కార్యాలయం నుండి అవసరమైన సిబ్బందిని సర్దుబాటు చేసి, కళాశాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. తాత్కాలికంగా భవనం వినియోగం గురించి కమిషనర్ తో మాట్లాడతానని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి డా మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, ఆయుష్ ఇంచార్జ్ తనూజా రాణి, టిజిఎంఎస్ఐడిసి డీఈ రాందేవ్, ఏ ఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

బోధన్, మార్చి21(వుదయం ప్రతినిధి): సాలురా మండలం మంధర్నా మంజీరా పరివాహక ప్రాంతం నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ను శుక్రవారం బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. సాలురా మండలం మంధర్నా నుండి ప్రభుత్వ పనులకు సాలురా తహశీల్దార్ ఉదయం 10 నుండి సాయంత్రం 5 వరకు పరిమిషన్ ఇచ్చారు.

# విద్యార్థులకు శుభాభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

నకిరేకల్, మార్చి21(వుదయం ప్రతినిధి): జీవితంలో ఉన్నత చదువులకు తొలిమెట్టు అయిన పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం శుభాభినందనలు తెలిపారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ప్రతి ఒక్కరూ గొప్ప ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నానని ఆయన అన్నారు.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

మహబూబ్‌నగర్, మార్చి21(వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లాలో శుక్రవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్లను రూమ్ నంబర్ వైస్ గా చెక్ చేసుకుని వెళ్తున్నారు. పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ విధించారు. పరీక్ష రాసే విద్యార్థులకు అధికారులు మంచినీటి వసతితో పాటు అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు.

# పీహెచ్‌డీ ప్రవేశాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి...

: మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు



కుత్బుల్లాపూర్, మార్చి 21,(వుదయం ప్రతినిధి ),పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, జిల్లా కమిటీ సభ్యుడు నందేశ్వర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఉన్నందున ఇక్కడ పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇక్కడ ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారని, వారు తమ సొంత విశ్వవిద్యాలయంలోనే ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉన్నదని ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థుల కంటే మొదటగా ఇక్కడి విద్యార్థులను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఎస్ఎఫ్ఐ నాయకులు లీల, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రారంభించిన మండల అభివృద్ధి అధికారి



బూర్గంపహాడ్ మార్చి 21(వు ద యం):బూర్గంపహాడ్ మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ ఆధ్వర్యం లో ప్రధాన కూడలిలో ఏర్పాటుచేసిన చలివెంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం బాటసారులకు, ప్రయాణికుల దాహర్తిని తీరుస్తుందని ఎండలు మండిపోతున్న తరుణంలో ఇలాంటి చలివెంద్రాన్ని ఏర్పాటుచేయడం చాలా అవసరమని ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు ప్రజలు ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవాని గ్రామస్తులు సా రెడ్డి దామోదర్ రెడ్డి అలవాలా సీతారామిరెడ్డి చేతుల పెదరత్నం సోము ఆదిరెడ్డి కైపు నాగిరెడ్డి బెజ్జం వెంకట్రాంరెడ్డి ధనసారి శ్రీను సత్యం సెనగ మల్లేశ్వర్రావు నంద్యాల ఏడుకొండలు పుట్టి రాజేష్ కొండయ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షల నిర్వహణ

జయశంకర్ భూపాలపల్లి మార్చి 21(వుదయం ప్రతినిధి) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పదవ తరగతి పరీక్షల ప్రారంభమై నిర్వహణ కొనసాగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు జిల్లాలోని 20 పరీక్షా కేంద్రాలలో ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలియజేశారు. 3449 విద్యార్థులకు 3441 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.సింగరేణి పాఠశాల తోపాటు ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు అని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి కాటారం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటారం మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు అన్నారు. పరీక్ష కేంద్రాలలో వైద్యము, కరెంటు, రవాణా సౌకర్యము తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాల వద్ద 144వ శిక్షను విధించినట్లు పోలీసు శాఖ వారు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్యము ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# టెన్త్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

కామారెడ్డి, మార్చి21(వుదయం ప్రతినిధి): కామారెడ్డి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పరిశీలించారు. పరీక్ష కేంద్రం బయట పోలీస్ బందోబస్తును పరిశీలించారు. పరీక్షకేంద్రం బయట పోలీసులు పరీక్షలు పూర్తయ్యే వరకు బందోబస్తులో ఎలాంటి నిర్లక్ష్యం పనికి రాదని, నిబంధనలు అమలయ్యేలా చూడాలని అక్కడి సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ చైతన్యరెడ్డి, టౌన్ సీఐ. చంద్రశేఖర్ రెడ్డి వున్నారు.

# .నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన నాయకులు

జుక్కల్, మార్చి21(వుదయం ప్రతినిధి): మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు పనులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు శుక్రవారం నూతన సీసీ నిర్మాణా పనులను ప్రారంభించారు. గ్రామాల్లో సంక్షేమ అభివృద్ధి పథకాలు సమర్ధవంతంగా అమలు అవుతాయని మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# రిజర్వేషన్ అమలు హర్షనీయం

మహేశ్వరం, మార్చి21(వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో అట్టగుడు వర్గాల అభివృద్ధికి 42 శాతం రిజర్వేషన్ అమలు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. శుక్రవారం తుక్కుగూడ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం పార్టీ శ్రేణులతో కలిసి చేశారు. బీసీ రిజర్వేషన్ రాజకీయ, ఉద్యోగ, విద్యా విధానంలో లభిస్తుందన్నారు.

# విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురికావద్దు...రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంతా రెడ్డి.



కోదాడ టౌన్ మార్చి 21(వుదయం) విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురికావద్దని, దేశ ప్రగతికి మీరే మూల స్తంభాలని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి, పదవ తరగతి ఫలితాలలో మంచి మార్కులు సాధించాలని రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంత రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం పది పరీక్షల సందర్భంగా రేస్ అకాడమీ బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లే ప్రగతి సాధిస్తారన్నారు. విద్యపైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు.ప్రతి విద్యార్థి నిరంతరం కష్టపడుతూ, ఒత్తిడిలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి కోదాడ పట్టణానికి రాష్ట్రస్థాయిలో పేరు తేవాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ బోధనలో భాగంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు రేస్ ఐఐటి కళాశాల ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ స్వేచ్ఛ రెడ్డి, ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె శివ శంకర్., తాటికొండ శ్రీనివాస్, వెంకట్, బెల్లంకొండ కాశయ్య రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, నాగేశ్వరరావు త్రివేణి , ప్రత్యూష , తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో ఎస్పీ కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి మార్చి 21(వుదయం ప్రతినిధి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మామునూరు బెటాలియన్ సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో జయశంకర్ జిల్లాలోని పోలీసు అధికారులు ఈ ఏడాదికి సంబంధించిన ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఈ సాధనలో శుక్రవారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పిస్టల్‌తో, ఏ కే 47, ఎస్ ఎల్ ఆర్, ఇన్సాస్, వివిధ ఆటోమేటిక్ వెపన్లతో ఫైరింగ్ సాధన చేశారు. పోలీసు అధికారులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఫైరింగ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని మంచి మెలకువలు చేర్చుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమైనవన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డిఎస్పి ఏ సంపత్ రావు, డి.ఎస్.పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ



శేర్లింగంపల్లి మార్చి21(వుదయం ప్రతినిధి): శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సుమారు మూడు కోట్ల 58 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు పిఏసి చైర్మన్ అరికపూడి గాంధీతో కలిసి స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరికపూడి గాంధీ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో నియోజకవర్గంలో చేపట్టటం ఎంతో సంతోషించదగిన విషయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ శేర్లింగంపల్లిలో ఆదర్శవంతమైన డివిజన్ గా రూపుదిద్దడంలో తమ వంతు కృషి ఎప్పుడు చేస్తామని ఆయన అన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనలో ముందుంటామని ఆయన తెలియజేశారు. నల్లగళ్ళ ఎస్సి బస్తీలో 40 లక్షలతో సిసి రోడ్లు, శ్రీకృష్ణ కాలనీలో 45 లక్షలతో సిసి రోడ్డు, టీఎన్జీవోస్ కాలనీలో 53 లక్షల 50 వేలు సిసి రోడ్డు, నానక్ రామ్ గూడలో 68 లక్షలు సీసీ రోడ్డు, రాయదుర్గం లో మంగళ బస్తి, ఎస్సీ బస్తి, కట్టెల బస్తి లలో 38 లక్షలతో సిసి రోడ్లు,

టెలికం నగర్ లో 84 లక్షలతో స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలు కాలనీవాసులు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ సూర్యోదయం హై స్కూల్ లో ముందస్తు రంజాన్ వేడుకలు...



మెట్ పల్లి మార్చ్ 21 (వుదయం విలేఖరి) శ్రీ సూర్యదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ముస్లిం విద్యార్థిని విద్యార్థులకు టీచర్లకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ దొంతుల రాజకుమార్ డైరెక్టర్ చర్లపల్లి రాజేశ్వర్ గౌడ్ ప్రిన్సిపాల్ విజయ కుమారి ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి - కే జి కే ఎస్



జనగాం/ మార్చి21(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ఒక్క రోజు దీక్ష కార్యక్రమంలో కే జి కే ఎస్ జిల్లా నాయకులు పాల్గొని జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. కాంగ్రెస్ పార్టీ గత శాసన సభ ఎన్నికల్లో ఆ పార్టీ మేని పేస్టోలో పేర్కొన్న విదంగా జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో జనగాం జిల్లా ఉపాధ్యక్షులు జొన్నగోని శ్రీనివాస్, బండపల్లి శంకరయ్య, జిల్లా నాయకులు బస్వగాని మహేందర్, బుర్ర లక్ష్మి నారాయణ, బైరాగోని వెంకటయ్య, ఉప్పునూతల అయోధ్య, తాళ్ళపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# షీ టీమ్స్ నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



కొత్తగూడ మార్చి 21(వుదయం ప్రతినిధి ): మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని కొత్తగూడ ఎస్సై కుశకుమార్ అన్నారు. శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయం, కొత్తగూడ నందు విద్యార్థినిలకు షీ టీం, సైబర్ క్రైమ్ నూతన చట్టాలు,బాల్య వివాహాల గురించి అవగాహన సదస్సు" కల్పించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశానుసారం కొత్తగూడ ఎస్సై పి.కుశ కుమార్ , షీ టీం ఎస్సై సునంద షీ టీం నూతన చట్టాలు సైబర్ క్రైమ్ గురించి గురించి వివరిస్తూ మాట్లాడారు విద్యార్థినిలకు మహిళల రక్షణ చట్టాలపై షీ టీం విధుల గురించి, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల మరియు విద్యార్థినుల భద్రతకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని అన్నారు. మహిళలు ఆపద సమయంలో డయల్100,షీ టీమ్ నెంబరుకు సంప్రదించాలని ఆడవాళ్ళు ఒంటరిగా ప్రయాణిస్తున్నపుడు ఏదైనా సమస్య వచ్చినపుడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి టీ –సేఫ్ అప్ ( ట్రావెల్ సేఫ్ ) ను ప్రతి ఒక్క మహిళ ఉపయోగించుకోవాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు మౌనంగా భరించ కుండా ముందుకు వచ్చి షీ టీమ్ ని సంప్రదించి ,వారి సమస్యలను పరిష్కరించుకోవాలని పలు సూచనలు చేశారు.షీ టీం ను సంప్రదించడానికి క్యూ ఆర్ కోడ్ విధానాన్ని పేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ఉపయోగించుకోవాలని.సోషల్ మీడియా లో కూడా షీ టీం ను సంప్రదించవచ్చని తెలిపారు. ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటిషన్, సైబర్ నేరాల అండ్ సైబర్ సెక్యూరిటీ సేవలు,1930, మరియు ఫోక్సో చట్టాల గురించి బాల్య గురించి 350మంది విద్యార్థినీలకు అవగాహన కల్పించడం జరుగుతుంది.కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా అలా బ్లాక్మెయిల్ చేసినట్లయితే పరువు పోతుందని భయపడకుండా షీ టీమ్ ని సంప్రదించాలని... షీ టీం కి కంప్లైంట్ చేసినట్లయితే కంప్లైంట్ యొక్క వివరాలు గోప్యం గా ఉంచబడతాయని, బాధితురాలు షీ టీమ్ ఆఫీస్ కి రాలేని పక్షంలో షీ టీం సభ్యులే వారి దగ్గరికి వెళ్లారని కావున ఎలాంటి భయం లేకుండా కంప్లైంట్ చేయాలని, షీ టీమ్ వాట్స్ అప్ నంబర్స్ 8712656935 కి తెలియచేసిన చో తగిన చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల హై స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కల్పన, అధ్యాపక సిబ్బంది,షీ టీం సిబ్బంది రమేష్, పార్వతి సౌభాగ్య, కొత్తగూడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మధిర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదరణ ఫౌండేషన్ లో అన్నదాన కార్యక్రమం





మధిర,మార్చి21(వుదయం ప్రతినిధి)మధిర సేవా సమితి ఆధ్వర్యంలోచల్లా సత్యనారాయణ, కళావతి,వందనపు శ్రీనివాసరావు, రాణి 33 వ పెళ్లిరోజు సందర్భంగా మధిర పట్టణంలోని ఆదరణ ఫౌండేషన్ లోని అనాధలకు అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేకు కటింగ్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మధిర పట్టణంలో సేవా కార్యక్రమాలు విరివిగా పాల్గొంటూ సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమని మునుముందు సేవా కార్యక్రమాలు చేస్తూ ఉండాలని అభినందించారు. ప్రతి ఒక్కరూ వారి వారి పుట్టినరోజులు పెళ్లిరోజు కార్యక్రమాలకు అన్నదాన కార్యక్రమాలు చేస్తూ లేని వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షులు పళ్ళపోతు ప్రసాదరావు, ముప్వ రామకృష్ణ సెక్రటరీ, జంగా నరసింహారెడ్డి(మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు), లింగంపల్లి అప్పారావు కోశాధికారి, చెడే రామకోటేశ్వరరావు, దాచేపల్లి రాము, మహంకాళి వెంకట శ్రీనివాసరావు,సామినేని రామనాథం,నంబూరి మురళీకృష్ణ, బత్తుల శ్రీనివాసరావు, చలువాది కృష్ణమూర్తి (ఆర్టీసీ ఎంప్లాయ్),ఓట్టే సైదులు, వేముల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను రక్షించు, అవి మనల్ని రక్షిస్తాయి

-ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్



శేర్లింగంపల్లి మార్చి21(వుదయం ప్రతినిధి): మారుతున్న కాలానుగుణంగా మనిషి ప్రవర్తన లోకూడా మార్పు రావాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడి బోయిన రామస్వామి యాదవ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని జలమండలి డివిజన్ నెంబర్ 15 జనరల్ మేనేజర్ బ్రిజేష్ గారు ఆవిష్కరించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ రోజురోజుకీ అడుగంటి పోతున్న భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. పేరుగుతున్న నగరాలలో రోజు రోజుకి నీటి అవసరాలు పెరుగుతున్నాయని దానికి తగ్గట్టుగా మనకి ఎటువంటి వనరులు లేవని కేవలం వాన నీటిని సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలను పెంచుకోవడం తప్ప మానవ మనుగడకు రానున్న కాలంలో గడ్డు రోజులు రాబోతున్నాయని ఆయన వాపోయారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకుంటూ తమ అవసరాలకు అనుగుణంగా వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత హైదరాబాద్ నగరంలో నీటి వాడుకతో పాటు వృధా ఎక్కువ జరుగుతుందని తద్వారా రానున్న కాలంలో తాగటానికి కూడా ఎన్నో అవస్థలు పడాల్సిన రోజులు రావచ్చునని, ప్రతి ఒక్కరూ ఇది గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. ప్రజలలో అవగాహన రహిత్యం వల్ల వాడుకునే నీరు అంటే అధిక మొత్తంలో వృధా అయ్యే నీరు ఎక్కువగా ఉందని ప్రతి ఒక్కరూ దీనిని గమనించాలని, నీటిని పొదుపుగా వాడుకున్నప్పుడే మానవ మనుగడ ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీహరి బాబు, కౌండిన్య శ్రీ ,నందూరి వెంకటేశ్వరరాజు ,శివరామకృష్ణ ,పాలెం శ్రీను, జనార్ధన్, బాలరాజు ,సుధాకర్, యూసఫ్ ,రామారావు, శివరామిరెడ్డి ,

మరియు జలమండలి అధికారులు నరేందర్ రెడ్డి, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

వికారాబాద్, మార్చి21(వుదయం ప్రతినిధి): వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా సరళిని కలెక్టర్ ప్రతిక్ జైన్ పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారా? త్రాగునీరు వంటి తదితర సౌకర్యాలు ఉన్నాయా? లేదా అని సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అక్కడ సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

# జీవాల దాహార్తి తీర్చేందుకు తొట్టెలు ఏర్పాటు

ఎల్బినగర్, మార్చి21(వుదయం ప్రతినిధి): వేసవి కాలంలో వీధి కుక్కలు, జంతువులు, పక్షుల దాహార్తి తీర్చేందుకు తొట్టెలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన న్యూ నాగోల్ కాలనీ రోడ్ నెంబర్ 10లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి నీటి తొట్టెలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో 50 నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.





# బిజినెస్



## దేశంలో పెట్రోల్, డీజిల్‌పై అత్యధిక పన్ను విధిస్తున్న రాష్ట్రం...




దక్షిణాది రాష్ట్రాలు అత్యధికంగా అమ్మకపు పన్ను వసూళ్లను కలిగి ఉన్నాయి. దాదాపు 30 శాతం. దీని తరువాత ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ ఇది 22 శాతం, 26 శాతం మధ్య ఉంటుంది. పశ్చిమ భారతదేశంలో ఈ సంఖ్య 25 నుండి 29 శాతానికి చేరుకుంటుంది. దేశంలో పెట్రోల్, డీజిల్‌పై ఆయా రాష్ట్రాలు పన్ను విధిస్తుంటాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ట్యాక్స్ ఉంటుంది. మరీ మీ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌పై ఎంత పన్ను విధిస్తున్నారో తెలుసా? దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి పెట్రోల్, మద్యంపై పన్ను భిన్నంగా ఉంటుంది. రాష్ట్రాలు తమ సౌలభ్యం, అవసరాలను బట్టి పన్నులను పెంచుతూ లేదా తగ్గిస్తూనే ఉంటాయి. దక్షిణ భారత రాష్ట్రాలు పన్ను చెల్లింపులలో అత్యధిక వాటాను కలిగి ఉన్నాయి. ఇది దాదాపు 30 శాతం. దీని తరువాత ఉత్తర భారత రాష్ట్రాలు ఉన్నాయి. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం.. దేశంలో పెట్రోల్, డీజిల్‌పై అత్యధిక పన్నులు విధించే రాష్ట్రాలలో తెలంగాణ ముందంజలో ఉంది. ఇక్కడ పెట్రోల్‌పై 35.20 శాతం వ్యాట్, డీజిల్‌పై 27 శాతం వ్యాట్ విధిస్తుంది. దీని తరువాత కేరళ ఉంది. ఇక్కడ పెట్రోల్‌పై 30.08 శాతం అమ్మకపు పన్ను, లీటరుకు రూ.1 అదనపు అమ్మకపు పన్ను, 1 శాతం సెస్, లీటరుకు రూ.2 సామాజిక భద్రతా సెస్ విధిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్ ఉంది. లీటరుకు 1 రూపాయి రోడ్ డెవలప్‌మెంట్ సెస్, 22.25 శాతం వ్యాట్, రూ. డీజిల్ పై 4 వ్యాట్, అలాగే రూ. లీటరుకు 1 రూపాయల రోడ్డు అభివృద్ధి సెస్ వర్తిస్తుంది. మహారాష్ట్రలో పెట్రోల్‌పై 25 శాతం వ్యాట్, లీటరుకు రూ. 5.12 అదనపు పన్ను, డీజిల్‌పై 21 శాతం వ్యాట్ విధిస్తున్నారు. కర్ణాటకలో పెట్రోల్‌పై 29.84 శాతం అమ్మకపు పన్ను, డీజిల్‌పై 18.44 శాతం అమ్మకపు పన్ను విధిస్తున్నారు. అందువల్ల ఈ రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్‌పై పన్ను భారం అత్యధికంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాలు అత్యధికంగా అమ్మకపు పన్ను వసూళ్లను కలిగి ఉన్నాయి. దాదాపు 30 శాతం. దీని తరువాత ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ ఇది 22 శాతం, 26 శాతం మధ్య ఉంటుంది. పశ్చిమ భారతదేశంలో ఈ సంఖ్య 25 నుండి 29 శాతానికి చేరుకుంటుంది.

## ఆల్ టైం రికార్డుకు పుత్తడి పరుగులు..



పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారం. కానీ గత వారం రోజులుగా బంగారం ధరల ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా పరుగులు లంకించుకున్నాయి. రోజురోజుకు రికార్డు స్థాయిలో ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. పసిడి ధరలు దడపుట్టిస్తున్నాయి. రోజురోజుకు రికార్డు స్థాయిలో ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో గురువారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పుతూ రూ.91 వేలను సమీపించింది. గత వారం రోజులుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇక ఈ రోజు (మార్చి 21) కూడా మరికాస్త ఎగబాకిన పుత్తడి 24 క్యారెట్లు తులం రూ.90,670కి చేరింది (గ్రాము ధర రూ.9,067). 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.83,110 (గ్రాము ధర రూ. 8,311) వద్ద కొనసాగుతుంది. ఇక 18 క్యారెట్ల బంగారం 10 గ్రాములుకు రూ.68,001 (గ్రాము ధర రూ.6,800) ధర పలుకుతుంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,001 చొప్పున ధరలు పలుకుతున్నాయి. గుంటూరులో లో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,001 చొప్పున ధరలు పలుకుతున్నాయి. విజయవాడ, ఖమ్మం వంటి ఇతర ప్రధాన నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాతున్నాయి.దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,820, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,260, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,120 చొప్పున ధరలు పలుకుతున్నాయి.కలకత్తాలో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,000 చొప్పున ధరలు పలుకుతున్నాయి.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,000 చొప్పున ధరలు పలుకుతున్నాయి.కేరళలో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,000 చొప్పున ధరలు పలుకుతున్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం తులం రూ.90,670, 22 క్యారెట్ల బంగారం తులం రూ.83,110, 18 క్యారెట్ల బంగారం తులం రూ.68,560 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

## కేంద్ర ప్రభుత్వంపై కోర్టుకు ఎక్కిన ఎలోన్ మస్క్ కంపెనీ..



అమెరికన్ పారిశ్రామికవేత్త ఎలోన్ మస్క్ సోషల్ మీడియా కంపెనీ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) భారత ప్రభుత్వంపై కోర్టును ఆశ్రయించింది. కంటెంట్‌ను తొలగించడానికి కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని, నిర్ణయం తీసుకునే ముందు సరైన విచారణను ఏర్పాటు చేయాలని కంపెనీ తెలిపింది. కంపెనీ ప్రకారం, ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, అమెరికన్ పారిశ్రామికవేత్త ఎలోన్ మస్క్ సోషల్ మీడియా కంపెనీ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) భారత ప్రభుత్వంపై కోర్టును ఆశ్రయించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్ నిబంధనలు, ఏకపక్ష సెన్సార్‌షిప్‌ను సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టులో కేసు దాఖలు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టంపై కేంద్రం వివరణ, సెక్షన్ 79(3)(బి) వినియోగంపై ఆ తన పిటిషన్‌లో ప్రశ్నించారు. ఇది సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తుందని, ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను దెబ్బతీస్తుందని ఆ వాదిస్తుంది.

చట్టపరమైన ప్రక్రియను దాటవేస్తూ, సమాంతర కంటెంట్ బ్లాకింగ్ యంత్రాంగాన్ని రూపొందించడానికి ప్రభుత్వం సెక్షన్ 69ఎని దుర్వినియోగం చేస్తోందని పిటిషన్ పేర్కొంది. ఈ విధానం శ్రేయ సింఘాల్ కేసులో సుప్రీంకోర్టు 2015 నిర్ణయాన్ని ఉల్లంఘిస్తుందని ఎక్స్ కంపెనీ పేర్కొంది. ఆ తీర్పు ప్రకారం కంటెంట్‌ను తగిన న్యాయ ప్రక్రియ ద్వారా లేదా సెక్షన్ 69ఎ కింద చట్టబద్ధంగా మాత్రమే బ్లాక్ చేయవచ్చని తెలిపింది. మరోవైపు, ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరిస్తుందని, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు చట్టాన్ని పాటించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకారం, సెక్షన్ 79(3)(ఎ) కోర్టు ఆదేశం, ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ఆదేశించినప్పుడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించింది. ఒక ప్లాట్‌ఫామ్ 36 గంటల్లోపు నిబంధనలను పాటించకపోతే, అది సెక్షన్ 79(1) కింద సురక్షితమైన హార్బర్ రక్షణను కోల్పోయే ప్రమాదం ఉంది. చట్టాల ప్రకారం జవాబుదారీగా ఉండవచ్చు. "సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్" అనేది కొన్ని సందర్భాల్లో సంస్థలు లేదా వ్యక్తులకు చట్టపరమైన రక్షణను అందించే చట్టపరమైన నిబంధన. అయితే, ఆ ఈ వివరణను సవాలు చేసింది. ఈ నిబంధన ప్రభుత్వానికి కంటెంట్‌ను నిరోధించే అపరిమిత హక్కును ఇవ్వదని వాదించింది. బదులుగా, ప్రభుత్వం తగిన ప్రక్రియను పాటించకుండా ఏకపక్ష సెన్సార్‌షిప్ విధించడానికి చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని ఎక్స్ కంపెనీ ఆరోపించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 69ఎ ప్రకారం, జాతీయ భద్రత, సార్వభౌమాధికారం లేదా ప్రజా క్రమానికి ముప్పు ఉంటే డిజిటల్ కంటెంట్‌కు ప్రజల ప్రాప్యతను నిరోధించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

## మల్టీబ్యాగర్ స్టాక్.. రూ. లక్ష పెడితే కోట్లొచ్చాయ్..



స్టాక్ మార్కెట్లో అనేక మల్టీబ్యాగర్ స్టాక్‌లు ఉంటాయి. కొత్త పెట్టుబడిదారులు కూడా మల్టీబ్యాగర్ స్టాక్‌ల కోసం వెతుకుతూ ఉంటారు. అయితే, మల్టీబ్యాగర్ స్టాక్‌ను కనుగొనడం అంత సులభం కాదు. ఓపిక, తెలివి చాలా ముఖ్యం. మంచి మల్టీబ్యాగర్ స్టాక్‌లో డబ్బు పెట్టుబడి పెడితే, అది మీకు అనేక రెట్లు రాబడిని ఇస్తుంది. అలాంటి ఒక మల్టీబ్యాగర్ స్టాక్ జ+ పవర్ ఓ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్. గత 5 సంవత్సరాలలో, జ+ పవర్ ఓ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ స్టాక్ 10,923 శాతం లాభాన్ని నమోదు చేసింది. మీరు 5 సంవత్సరాల క్రితం ఈ షేర్‌లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, నేడు ఆ మొత్తం రూ. 1.09 కోట్లకు చేరుకుంది.

ఎందుకంటే 2020లో ఈ షేరు ధర కేవలం రూ. 5.85 మాత్రమే, కానీ నేడు ఈ షేరు బిఎస్ఇలో రూ. 654.70 వద్ద ట్రేడవుతోంది. ఈరోజు ఉదయం 11 గంటలకు, కంపెనీ స్టాక్ బీఎస్ఈలో 1.41 శాతం క్షీణతతో రూ.653.85 వద్ద ట్రేడవుతోంది. ఈరోజు కంపెనీ షేరు రూ.670.80 వద్ద ప్రారంభమైంది, ఇది మునుపటి ముగింపు కంటే 662.50 శాతం ఎక్కువ. గత 25 సంవత్సరాలలో, ఈ స్టాక్ 13,987 శాతం వరకు భారీ రాబడిని ఇచ్చింది.

గత ఒక్క సంవత్సరంలోనే ఈ స్టాక్ 35 శాతానికి పైగా రాబడిని ఇచ్చింది. అయితే, గత కొన్ని నెలలుగా ఈ స్టాక్ చాలా అస్థిరతను చూసింది. గత 6 నెలల్లో ఈ స్టాక్ 12.46 శాతం క్షీణించగా.. గత ఒక నెలలో ఈ స్టాక్ 11.37 శాతానికి పెరిగింది. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 30.29 శాతం లాభపడింది. 5 సంవత్సరాలలో ఈ స్టాక్ 11078.63 శాతం లాభపడింది. మార్చి 18, 2025న జరిగిన బోర్డు సమావేశంలో కంపెనీ ఒక్కో షేరుకు రూ.1.30 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. దీని కోసం కంపెనీ మార్చి 22ని రికార్డ్ తేదీగా కూడా నిర్ణయించింది. డివిడెండ్ మీకు ఏప్రిల్ 16, 2025న లేదా ఆ తర్వాత చెల్లించబడుతుంది.

## ఒప్పో ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్



స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ ఒప్పో ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త మిడ్-రేంజ్ ఫోన్లను తీసుకువచ్చింది. ఒప్పో ఎఫ్29 5జీ, ఒప్పో ఎఫ్29 ప్రో 5జీ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను విడుదల చేసింది. దేశంలోని అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఫోన్ల ను ఐపీ66, ఐపీ68, ఐపీ69 ప్రమాణాలతో తీసుకువచ్చినట్లు ఒప్పో ఇండియా ప్రొడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ సావియో డిసౌజా వెల్లడించారు. బెంగళూరులోని ఎస్‌జిఎస్ (సొసైటీ జనరల్ డి సర్వియలెన్స్)లో ఈ ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్ ఐపీ ప్రమాణాలను పరీక్షించినట్లు పేర్కొన్నారు. దుమ్ము ధూళి, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవటంతో పాటు వర్షంలో తడిచినా, నీటిలో పడినా రక్షణ కల్పించేలా ఈ స్టాండర్డ్స్ ఉంటాయని ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడాలోని ప్లాంట్‌లో ఈ స్మార్ట్‌ఫోన్స్ ఉత్పత్తి చేస్తున్నట్లు డిసౌజా పేర్కొన్నారు. ఒప్పో ఎఫ్27 సిరీస్ తీసుకువచ్చిన సమయంలో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని, ఎఫ్29 సిరీసకు అదే స్థాయిలో స్పందన వస్తుందని అంచనా వేస్తున్నట్లు డిసౌజా తెలిపారు. ఈ నెల 27 నుంచి ఎఫ్29 5జీ మోడల్, ప్రో మోడల్ ఏప్రిల్ 1 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఫీచర్లు: ఈ రెండు స్మార్ట్‌ఫోన్స్‌ను 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ-అమోలెడ్ స్క్రీన్‌తో ఒప్పో తీసుకువచ్చింది. ఇందులో ఎఫ్29 ప్రో 5జీ.. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ చిప్ ప్రాసెసర్‌తో తీసుకురాగా ఎఫ్29 5జీని క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6 జెనరేషన్ 1 ప్రాసెసర్‌తో తీసుకువచ్చింది. 50ఎంపీ ప్రైమరీ కెమెరా, 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఈ ఫోన్ల ప్రత్యేకతలు. వేరియంట్స్: ఒప్పో ఎఫ్29 5జీ.. 8జీబీ రామ్‌128జీబీ స్టోరేజ్ మోడల్ ధర రూ. 23,999గా ఉండగా 8జీబీ256 జీబీతో కూడిన ఫోన్ ధర రూ. 25,999గా ఉంది. కాగా ఎఫ్29 ప్రో 5జీ ధర రూ. 27,999 (8జీబీ128జీబీ), రూ. 29,999 (8జీబీ256జీబీ), రూ. 31,999 (12 జీబీ256జీబీ)ధరతో అందుబాటులో ఉండనుంది.

## ప్రపంచ వృద్ధికి అమెరికా పోటు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తోన్న అనిశ్చితి ఆర్థిక విధానాలు, టారిఫ్‌ల పెంపు ప్రపంచ దేశాల వృద్ధి రేటును దెబ్బతీస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ వెల్లడించింది. అమెరికా వాణిజ్య యుద్ధంతో 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.3 శాతానికి పడిపోవచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని అంచనా వేసింది. అమెరికా వేగంగా పెంచుతోన్న సుంకాలు ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఫిచ్ తన 'గ్లోబల్ ఎకనామిక్ అవుట్‌లుక్'లో తెలిపింది. 2024లో గ్లోబల్ వృద్ధి 2.9 శాతం పెరగనుందని తొలుత అంచనా వేసిన ఈ సంస్థ.. డిసెంబర్‌లో 2.6 శాతానికి కుదించింది. అమెరికా వాణిజ్య యుద్ధం ఎంత వరకు తీసుకెళ్తోందో ఇప్పుడే చెప్పలేమని పేర్కొంది. యూరప్ సహా ఇతర దేశాలపై యుఎస్ వేస్తోన్న సుంకాలు దెబ్బకొట్టనున్నాయని తెలిపింది. 2026లో గ్లోబల్ వృద్ధి మరింత తగ్గి 2.2 శాతానికి పరిమితం కావొచ్చని హెచ్చరించింది. ఈ ఏడాది అమెరికా జిడిపి రేటును 1.1 శాతం కోత పెట్టి.. 1.7 శాతానికి పరిమితం చేసింది. 2024లో 2.8 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. చైనా, యూరోపియన్ యూనియన్ వృద్ధి తగ్గనుందని ఫిచ్ పేర్కొంది. అయితే జపాన్ మాత్రం 2024లో 0.1 శాతం వృద్ధిని నమోదు చేయగా.. 2025లో 1.1 శాతం వృద్ధి సాధించనుందని తెలిపింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత 2024-25లో 6.3 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2025-26లో 6.5 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. ఇది ఆర్‌బిఐ అంచనా 6.7 శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. అమెరికా వాణిజ్య విధానాలు ప్రధాన సవాళ్లుగా నిలువనున్నాయని పేర్కొంది. వినియోగదారుల విశ్వాసం తగ్గిందని పేర్కొంది. దీంతో వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకుంటున్న విషయాన్ని ఫిచ్ గుర్తు చేసింది. 2024-25లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ఎన్ఎస్ఓ అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి. ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది.

# జాతీయం – అంతర్జాతీయం

## ఆదిత్య థాక్రే పై కేసు నమోదు చేయండి..





ముంబై : బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ , మాజీ మేనేజర్ దిశా సాలియన్ తండ్రి సతీశ్ సాలియన్ ముంబై హైకోర్టును ఆశ్రయించారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య థాక్రేపై కేసు నమోదు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. ఆదిత్య థాక్రేకు వ్యతిరేకంగా ఆయన న్యాయస్థానాన్ని సంప్రదించడం మహారాష్ట్రలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పిటిషన్‌లో ఆదిత్య థాక్రే పై లైంగిక ఆరోపణలు చేశారు. ఐదేళ్ల క్రితం బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. నటుడి మరణానికి వారం రోజుల ముందు అతడి మాజీ మేనేజర్ దిశా సాలియన్ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. 2020 జూన్ 8 న ముంబై లోని ఓ భవనంపై నుంచి దూకి ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. దిశా చనిపోయిన రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ తన ఫ్లాట్‌లో శవమై కనిపించారు. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఆ సమయంలో అధికారంలో ఉన్న ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వం ఈ కేసును కప్పిపుచ్చుకునేందుకు యత్నించిందనే ఆరోపణలు వచ్చాయి. హత్య, అత్యాచారంతో పాటు సుశాంత్ మృతి తోనూ ముడిపెడుతూ ప్రచారం సాగింది. నాడు తన కుమార్తె మృతికి సంబంధించి ఎవరిపైనా అనుమానాలు వ్యక్తం చేయలేదు సతీశ్ సాలియన్.

ప్రస్తుతం ఆదిత్యథాక్రేతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జూన్ 8న తన కుమార్తె ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసిందని, దానికి ఆదిత్యథాక్రేతోపాటు అతని బాడీ గార్డులు , నటులు సూరజ్ పంచోలి, డినోమోరియా , మరికొందరు హాజరయ్యారని, తాజాగా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆమె లైంగిక వేధింపులకు గురైందని, తన కుమార్తెపై సామూహిక అత్యాచారం జరిగిందని ఆరోపించారు. ఈ కేసుపై విచారణ జరిపించాలని కోరారు. ప్రస్తుతం ఈ అంశం మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## ఉభయ సభలకు తమిళ ఎంపీల టీషర్టుల సెగ




తమిళనాడు ఎంపీలు ధరించిన టీ షర్టులే పార్లమెంటు నిర్వహణకు అడ్డంకిగా మారాయి. వారు ధరించిన టీ షర్టులపై "న్యాయమైన డీలిమిటేషన్.. తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది" అనే నినాదం ఉంది. ఆ నినాదాలున్న టీషర్టులతో వారు సభల్లో ఉంటే కార్యకలాపాలు కొనసాగవని, వాటిని తొలగిస్తేనే సభ నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మెన్ సభలు వాయిదా వేశారు. గురువారం ఉభయ సభలకు చెందిన డీఎంకే ఎంపీలు డీలిమిటేషన్ అంశంపై నినాదం రాసి ఉన్న టీ-షర్టులు ధరించి పార్లమెంటుకు హాజరై, నిరసన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం తెలిపారు. కొంతమంది సభ్యులు సభా మర్యాదలు, నియమాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. సభా సభ్యుల ప్రవర్తనకు సంబంధించి 349వ నియమాన్ని ఎత్తిచూపారు. టీ-షర్టులు మార్చిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభిస్తానని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేస్తూ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైనప్పుడూ వారు టీ-షర్టులతోనే సభకు వచ్చారు. మధ్యాహ్నం 2 గంటల వరకు మళ్లీ వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలోనూ డీఎంకే ఎంపీలు టీషర్టులతోనే హాజరయ్యారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. మూడు, నాలుగు నిమిషాల్లోనే సభ నేటీకి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు, తమిళనాడును అవమానించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు రాసిన దుస్తులనూ కొంతమంది ఎంపీలు ధరించి వచ్చారు. వారిని గమనించిన రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ సభ కార్యకలాపాలను గంటసేపు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. టీ షర్టులను తీసివేసి వారు సభకు వస్తే వివిధ పార్టీల నాయకులతో చర్చించాల్సిన కొన్ని విషయాలున్నాయన్నారు.

చైర్మెన్ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో టీ-షర్టులు తొలగించే ప్రసక్తే లేదని డీఎంకే ఎంపీలు స్పష్టం చేశారు.

## ఎటిఎజిఎస్ ఆయుధాల సేకరణకు రూ. 7 వేల కోట్లతో ఒప్పందం

స్వదేశీ రక్షణ రంగానికి కేంద్రం చెప్పుకోతగిన ఆర్థిక ఆసరా కల్పించింది.



ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో రక్షణకు సంబంధించిన క్యాబినెట్ కమిటీ (సిసిసి) భారత సైన్యం కోసం ఎటిఎజిఎస్ (అడ్వాన్స్‌డ్ టువెడ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ ) ఆయుధాల సేకరణకు రూ.7000 కోట్లతో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. స్వదేశీయంగా అలాంటి హోవిట్జర్ ఆయుధాలను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈమేరకు 155 ఎంఎం ఆర్టిలరీ గన్ సిస్టమ్ తయారు అవుతాయి. ఈ ఆయుధాల వల్ల భారత సైన్యం తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడానికి వీలవుతుంది. ఈ తుపాకీలు 52కాలిబర్ బారెల్, 45 కిమీ దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించగలుగుతాయి. ఈ ఒప్పందం వల్ల మొత్తం 307 తుపాకీలు, 327 సాయుధ వాహనాలు సమకూరుతాయి. డిఫెన్స్ రీసెర్చి డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డివొ) , భారత ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో ఈ ఆయుధాలు స్వదేశీయంగా తయారవుతాయి. పశ్చిమాన పాక్, ఉత్తరాన చైనా సరిహద్దుల్లో భారత సైన్యానికి ఈ ఆయుధాలు అందిస్తారు. భారత సాయుధ దళాల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న పాత 105 ఎంఎం, 130 ఎంఎం తుపాకులకు బదులుగా ఎటిఎజిఎస్ ఆయుధాలు వినియోగం లోకి వస్తాయి. సైన్యానికి కావలసిన ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్, కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్ సిస్టమ్స్ టార్పెడోలు,టి90 టాంకులకు ఇంజిన్లు సమకూర్చుకోడానికి ఈ నిదులు వెచ్చిస్తారు. 2025 ను సంస్కరణల సంవత్సరంగా రక్షణ శాఖ పరిగణిస్తోంది. ఈమేరకు సైనికులకు కావలసిన సామగ్రిని సమకూరుస్తారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డిఎసి ప్రతిపాదనలకు ఆమోదమైందని రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## కేంద్ర ప్రభుత్వంపై మస్క్ 'ఎక్స్' దావా



బెంగళూరు : ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క‌ నేతృత్వం లోని సోషల్ మీడియా 'ఎక్స్' భారత ప్రభుత్వంపై దావా వేసింది. ఈమేరకు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చట్ట విరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని కేంద్రంపై ఆరోపణలు చేసింది. ఐటి చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందకే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టం లోని సెక్షన్ 79 (3)(ఎని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. న ఐటీ చట్టం ప్రకారం బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69 ఖ ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సృష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69 ఎ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదే సమయంలో సెక్షన్ 79 (3) (ఎ) స్పష్టమైన నియమాలు, తనిఖీలు లేకుండా అధికారులు సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని, తన పిటిషన్‌లో ప్రస్తావించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది విస్తృతమైన సెన్సార్‌షిప్‌నకు దారి తీస్తోందని విమర్శలు చేసింది. ఈ దావాపై కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆయా వర్గాలు పేర్కొన్నాయి.

### లండన్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం..

లండన్ నగరంలోని హీత్రూ విమానాశ్రయాన్ని బంద్ చేశారు. గురువారం రాత్రి నగరంలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఓ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో అక్కడ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు 16 వేల ఇండ్లకు విద్యుత్తు నిలిచిపోయింది. లండన్ ఫైర్ బ్రిగేడ్ ప్రమాద స్థలానికి 10 ఫైరింజన్లను, 70 మంది అగ్నిమాపక సిబ్బందిని పంపించింది. 300 మీటర్ల మేర సేఫ్టీ కార్డన్‌ను ఏర్పాటు చేశారు. హీత్రూ విమానాశ్రయం ప్రయాణికులకు హెచ్చరిక చేసింది. సంబంధిత ఎయిర్‌లైన్స్‌తో టచ్‌లో ఉండాలని తెలిపింది. విమానాశ్రయానికి విద్యుత్తును సరఫరా చేసే ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగిందని, ఎయిర్‌పోర్టుకు తీవ్రమైన కొరత ఉందని, ప్రయాణికుల సేఫ్టీ కోసం శుక్రవారం హీత్రూ విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే అనేక విమానాలను డైవర్ట్ చేశారు. బ్రిటన్‌లో అతిపెద్ద విమానాశ్రయం హీత్రూ. ప్రతి రోజు సుమారు 1300 ల్యాండింగ్‌లు, టేకాఫ్‌లు ఉంటాయి.



### అమెరికాలో భారతీయ విద్యార్థి అరెస్టు

హమాస్‌కు మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలతో భారత్‌కు చెందిన కొలంబియా విద్యార్థి స్వీయ బహిష్కరణకు గురైన వారంలోపే, అమెరికాలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా చేరిన భారతీయుడిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారని ఓ మీడియా నివేదిక తెలిపింది. బదర్ ఖాన్ సూరి అనే ఆ విద్యార్థి న్యూఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామీయ పూర్వ విద్యార్థి. సూరి భార్య పాలస్తీనా వారసత్వం కలిగినందున అతడిని ఈ విధంగా శిక్షిస్తున్నారని ఆయన తరఫు లాయర్ అన్నారు. ఇజ్రాయెల్ విషయంలో అమెరికా విదేశాంగ విధానంను వారు వ్యతిరేకించొచ్చని ప్రభుత్వం అనుమానిస్తోందని ఆయన తెలిపారు. వర్జీనియాలోని అతడి ఇంటి ముందు సోమవారం రాత్రి మాస్క్ ధరించి వచ్చిన ఏజెంట్లు అతడిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన లాయర్ హసన్ అహ్మద్ పిటిషన్ దాఖలు చేశారు.

### రిబ్బన్ కలర్ మారిందని ఉద్యోగిపై ఎంఎల్ఏ దాడి..

దిస్ పూర్: రిబ్బన్ కలర్ మారిందని ఉద్యోగిపై ఓ ఎంఎల్ఏ విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ సంఘటన అస్సాం రాష్ట్రంలోని బిలాస్ పూర్ లో జరిగింది. బిలాస్‌పూర్ స్థానిక ఎమ్మెల్యే షంసుల్ హుడా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చారు. కాంట్రాక్టర్ ఉద్యోగి సాహిదుర్ రెహమాన్ ఎరుపు రంగుకు బదులుగా గులాబీ రంగు రిబ్బన్ పెట్టించారు. గులాబీ రంగు రిబ్బన్ కనిపించగానే ఎంఎల్ఏ షంసుల్ ఆగ్రహంతో ఊగిపోయారు. రెహమాన్ గల్లా పట్టుకొని దగ్గరికి లాగి అతడి చెంప చెళ్లుమనిపించాడు. అక్కడ ఉన్న ఆరటి చెట్టు కాండను తీసుకొని అతడిపై ఎంఎల్ఏ పలుమార్లు దాడి చేశారు. ఉద్యోగిపై ఎంఎల్ఏ దాడి చేయడంతో అక్కడ ఉన్నవారు షాక్ కు గురయ్యారు. ఎమ్మెల్యే అహంకారం, అధికార దుర్వినియోగానికి ఇది నిదర్శనమని రెహమాన్ మండిపడ్డారు. రిబ్బన్ రంగు మారితే దాడి చేయాలా? అని నెటిజన్లు మండిపడుతున్నారు. చిన్న విషయానికే కంట్రాక్ట్ ఉద్యోగిని చావబాదారని, అవినీతికి పాల్పడిన ప్రజాప్రతినిధులను ఏం చేయాలని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.




## హెచ్ -బి వీసా నిబంధనల్లో మార్పులు

అమెరికా సిటిజన్ షిప్, ఇమిగ్రేషన్ శాఖ, హెూమ్ లాండ్ సెక్యూరిటీ శాఖ అత్యంత కీలకమైన హెచ్ -1 బి వీసా కార్యక్రమంలో పలు మార్పులను ప్రవేశపెట్టాయి. నేటి నుంచే ఈ మార్పులు అమలులోకి వచ్చాయి. అమెరికాలోని పలు కంపెనీలు నాన్ ఇమిగ్రెంట్ కార్మికులను నియమించుకునేందుకు అవకాశం కల్పించే ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్ వే వ్యవస్థ( ఎఫ్ఎల్ఏజి) పాత అప్లికేషన్లను తొలగించే పని చేపట్టినట్లు మీడియా తెలిపింది. 2022 అక్టోబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకూ నిపుణులైన భారతీయ కార్మికులు 70 శాతం హెచ్ -1బి వీసాలను అందుకున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు కూడా పది డాలర్ల నుంచి 215 డాలర్లకు పెంచారు. కాగా, అమెరికా ప్రెసిడెంట్ గా డోనాల్డ్ ట్రంప్ రెండో సారి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇమిగ్రేషన్ విధానానికి సంబంధించి త్వరలో పలు నిర్ణయాలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చేస్తున్న హెచ్ 1బి వీసా నిబంధనల మార్పుల్లో కొన్ని.ఐదు ఏళ్ల కంటే పాత రికార్డులు ఉంటే, వాటిని ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్ వే వ్యవస్థ (ఎఫ్ ఎల్ ఏజి) నుంచి తొలగిస్తారు. ఐదేళ్ల కంటే ముందు ఉన్న పాత కేసులను తొలగించాలని కంపెనీల యజామానులనూ ఆదేశించారు. గురువారం నుంచి ఈ ఆదేశం అమలు లోకి వస్తుంది.అలాగే తాత్కాలిక లేబర్ దరఖాస్తులను తొలగిస్తారు. అమెరికా హెూం లాండ్ సెక్యూరిటీ శాఖ కింద పనిచేసే యుఎస్ సిటిజన్ షిప్,ఇమిగ్రేషన్ శాఖ ఉద్యోగులకోసం కొత్త అప్లికేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని యోచిస్తోంది. గతంలో పలు కంపెనీల యజమానులు ఒక వ్యక్తికోసం దరఖాస్తు చేసే వీలు ఉంది. కానీ కొత్తవ్యవస్థలో దరఖాస్తుదారులు అందరికీ సమాన అవకాశం ఇస్తుంది. ఎంతమంది యజమానులు అప్లికేషన్ లు సమర్పించారన్నదానితో సంబంధం లేకుండా చూస్తారు. అలాగే రిజిస్ట్రేషన్ ఫీజును ఒక్కో ఎంట్రీకి 10 అమెరికా డాలర్ల నుంచి 215 డాలర్లకు పెంచారు.

## అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గిస్తుంది



అమెరికా వస్తువులపై భారతదేశం తన సుంకాలను తగ్గిస్తుందని తాను నమ్ముతున్నట్లు ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి ఆ దేశంపై అమెరికా గతంలో ప్రకటించిన విధంగా సుంకాలను విధిస్తామని పునరుద్ఘాటించారు. అమెరికా వెబ్ సైట్ బ్రీట్ బార్ట్ న్యూస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ భారతదేశంతో అమెరికా సంబంధాలపై మాట్లాడారు. గతనెల భారత ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన శిఖరాగ్రసభ పై ప్రస్తావించినప్పుడు తనకు భారతదేశంతో చాలా మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. భారతదేశంతో ఉన్న ఏకైక సమస్య ఏమిటంటే, ప్రపంచంలో అత్యధికంగా సుంకాలు విధించే దేశాలలో భారత్ ఒకటి అని పేర్కొన్నారు. ఇండియా బహుశా ఆ సుంకాలను గణనీయంగా తగ్గిస్తుందని తాను నమ్ముతున్నానని,

అయితే ఏప్రిల్ 2 నుంచి అమెరికా వారి నుంచి వసూలు చేసే సుంకాలు కూడా అదే స్థాయిలో ఉంటాయని స్పష్టం చేశారు.మోదీ అమెరికా పర్యటన సందర్భంగా కుదిరిన ఇండియా – మిడిల్ ఈస్ట్ –యూరప్– ఎకనమిక్ కారిడార్ ను గుర్తించినప్పుడు ట్రంప్ చైనా గురించి ప్రస్తావించకపోయినా, అవి అద్భుతమైన దేశాల సమూహం అన్నారు. వాణిజ్య రంగంలో అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసే ఇతర దేశాలకు గట్టి సమాధానం ఇచ్చే దేశాల సమూహం ఇది అన్నారు. వాణిజ్యరంగంలో శక్తివంతమైన భాగస్వామ్య దేశాల గ్రూప్ ఇదని ట్రంప్ స్పష్టం చేశారు. ఏ దేశం అమెరికాను తేలిగ్గా తీసుకోవడాన్ని అనుమతించబోము. వేము మిత్రపక్షాలైనా, ఇతరదేశాలైనా వారిని అన్నివిధాలా మెరుగ్గానే చూస్తాం అని ట్రంప్ స్పష్టం చేశారు.ట్రంప్ ఈ నెలారంభంలో మాట్లాడుతూ భారతదేశం తన సుంకాలను చాలా మేరకు తగ్గించడానికి అంగీకరించిందన్నారు. అయితే ఆ దేశంపై అమెరికా పై భారీ సుంకాలను విధిస్తున్నందువల్ల అక్కడ అమెరికా ఉత్పత్తులు అమ్మడం కష్టమవుతోందన్న అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.కాగా, భారత %-% అమెరికాల మధ్య ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయని, ట్రేడ్ టారిఫ్ విషయంలో రెండు దేశాలమధ్య ఇంతవరకూ ఓ ఒప్పందం కుదరలేదని మార్చి 10న న్యూఢిల్లీలో పార్లమెంటరీ బృందానికి కామర్స్ సెక్రటరీ సునిల్ బర్త్వాల్ తెలిపారు.

## గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు..

జెరూసలెం : ఇజ్రాయెల్ హమాస్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్‌అవీవ్ దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. గురువారం ఉదయం గాజా పై ఐటీఎఫ్ వైమానిక దాడుల్లో 70 మంది మృతి చెందినట్టు స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేక మంది చిన్నారులు ఉన్నట్టు వెల్లడించారు. ఇక ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బందీలందరినీ తిరిగి ఇవ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరోవైపు నెట్జారిమ్ నడవాలో కొంత భూభాగాన్ని టెల్ అవీవ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడ నుంచి పాలస్తీనా వాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు దానికి దక్కింది. మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికి పైగా మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి హమాస్ తిరస్కరించడంతో దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని యుద్ధ లక్ష్యాలను సాధించడానికి గాజా లోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# చక్కని ఆరోగ్యం



## తలలో చెమటలు ఎక్కువగా పడుతున్నాయా..

ఎండాకాలంలో ఒంటి మీదనే కాదు చాలా మందికి తలలోంచి చెమటలు కారిపోతుంటాయి. ఇది చిన్న సమస్యగానే అనిపించినా నలుగురిలో ఉన్నప్పుడు చాలా ఇబ్బంది పెట్టేస్తుంది. తలమీద జుట్టు లేని కారణంగానో, ఎండ వల్లనో ఇలా జరుగుతుందని అనుకుంటే ఇది అన్నిసార్లు సరైంది కాకపోవచ్చు. ఎందుకంటే కొన్ని సార్లు ఇది మీ శరీరంలో లోపాలను చెప్పే సంకేతం కూడా కావచ్చు. అసలే ఎండాకాలం.. చెమటలు పట్టడం అనేది ఎంతో సహజమైన సమస్య. అయితే కొందరిలో అదే పనిగా తల లోంచి చెమటలు నీళ్లు ధార పోసినట్టుగా కారుతుంటాయి. ఇలా ఎందుకు జరుగుతుందని చాలా మంది ఆలోచించరు. ముఖ్యమైన మీటింగ్స్ లో ఉన్నప్పుడు.. కాస్త ఎండలోకి వెళ్లినా సరే ఒంటిమీద కన్నా తలలోంచే చెమటలు వరదలై పారుతుంటాయి. ఇక జేబులోంచి ఖర్చీఫ్ తీసుకుని తుడుచుకోవడం తప్ప దీనికి మరో పరిష్కారం లేదు. కానీ ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుంటే ఈ సమస్యను వెంటనే తగ్గించుకోవచ్చు. మీ తల ఎక్కువగా చెమట పడుతుంటే అది అన్ని సార్లు అంత డేంజర్ ఏమీ కాదు. కొన్ని సందర్భాల్లో మాత్రం ఇది మీ శరీరం మీకు తెలియజేసే సూచన కావచ్చు. ఎందుకంటే ఎవరికైతే బాడీలో విటమిన్ డి డెఫిషియన్సీ అధికంగా ఉంటుందో వారిలో తలంతా చెమటలతో తడిచిపోతుంటుంది. తల ఎక్కువగా చెమట పట్టడం అనేది విటమిన్ డి లోపంతో సంబంధం ఉన్న మరొక ముఖ్యమైన లక్షణం. ఒకసారి మీ విటమిన్ డి లెవెల్స్ ను చెక్ చేయించుకుంటే సరిపోతుంది. అవసరాన్ని బట్టి నాలుగు వారాల పాటు వైద్యులు సూచించే సప్లిమెంట్స్ తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టినట్లే. వేసవిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అలాంటి వారు కొన్ని చిన్నపాటి పరిష్కారాలతో దీనిని పరిష్కరించవచ్చు. ఈ సమస్య ఉన్నవారు వేసవిలో ప్రతి రోజు తల స్నానం చేయడం చాలా మంచిది. తప్పకుండా ఆర్గినిక్ షాంపులను మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఇలాంటి షాంపూలతో స్నానం చేయడం వల్ల జుట్టులో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అంతేకాకుండా చమట సమస్యలు రాకుండా ఉంటాయి. కాబట్టి సమ్మర్‌లో ప్రతి రోజు తల స్నానం చేయాలి. రసాయనాలు తక్కువగా ఉన్న షాంపూను ఎంచుకోండి.

## క్యారెట్, బీట్ రూట్ జ్యూస్ కలిపి తాగితే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్టే..



తాజా పండ్లు, కూరగాయల్లో మంచి పోషకాలుంటాయి. చర్మం మెరవాలంటే పండ్ల రసాలతో పాటు, వెజిటేబుల్ రసాలు కూడా మంచివే. ఇవి ఆరోగ్యంగా వుంచటమే కాక త్వరగా శరీర చర్మంపై ఎఫెక్ట్ చూపుతాయి. ముఖ్యంగా ఎండాకాలంలో ఈ పోషకాలు శరీరానికి ఎంతో అవసరం అవుతాయి. ఈ రసాలను శరీరం అతి త్వరగా పీల్చేసుకుని జీర్ణం చేసుకుంటుంది. రోజువారీ జీవితంలో ఎవరెంత బిజీ షెడ్యూల్ వున్నా తప్పకుండా ఒక్క గ్లాస్ ఈ జ్యూస్ తాగితే శరీరానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎండాకాలంలో చర్మ ఆరోగ్యం కోసమే కాదు.. డీహైడ్రేషన్ దరిచేరకుండా ఉండాలన్నా కూడా మంచి పోషకాలున్న జ్యూసులు తాగడం ఎంతో అవసరం. అందులో బీట్ రూట్ క్యారెట్ ముందువరుసలో ఉంటాయి. దీని రంగులో ఉండే తాజాదనమే ఈ దుంపలో కూడా ఉంటుంది. క్యారెట్‌లో విటమిన్ సి, బీటా కెరోటిన్‌లు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి వృద్ధాప్యం, ముడుతలతో సంబంధం ఉన్న ఫ్రీరాడికల్ చర్యను నిరోధిస్తుండగా, బీటా కెరోటిన్ చర్మ మంటను నివారిస్తుంది. అంతే కాదు, ఫైబర్ అధికంగా ఉండే బౌల్ మూమెంట్‌ని మెరుగుపరిచి, పొట్టను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుంది. ఇది దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చుతుంది. వృద్ధాప్యఛాయలను దరిచేరనివ్వదు. ఈ సమయంలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మినరల్స్ అధికంగా ఉండే ఆహారాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. అప్పుడు ఎండాకాలంలో కూడా ఆరోగ్యంగా ఉండొచ్చు. అందుకు క్యారెట్ రసం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఎండాకాలం మొదలైందంటే.. సీజన్ మారుతున్న ఈ సమయంలో ఇంట్లో రకరకాల వ్యాధులు కనిపిస్తున్నాయి. ఈ సమయంలో మిమ్మల్ని మీరు ఫిట్‌గా ఉంచుకోవడం చాలా కష్టమైన పని. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులు తమను తాము బాగా చూసుకోవాలి. మీ రోజువారీ ఆహారంలో కొన్ని ఆహారాలను జోడించడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. క్యారెట్లో విటమిన్లు ఎ, బి, ఇ, కాల్షియం, ఫైబర్ ప్రోటీన్ వంటి అనేక పోషకాలు లభిస్తాయి. మరోవైపు, దుంపలలో ఇనుము, సోడియం, పొటాషియం, ఫైబర్ ఉంటాయి. ఇది సహజ చక్కెరలకు కూడా మంచి మూలం. ఈ రెండు కూరగాయల రసాన్ని మిక్స్ చేయడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. బీట్-క్యారెట్ జ్యూస్ శరీరంలో అధిక బరువు పెరగకుండా చేస్తుంది. రోజూ ఒక బీట్-క్యారెట్ జ్యూస్ తీసుకోవచ్చని చెప్పారు. ఇందులో తక్కువ కేలరీలు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి ఈ జ్యూస్ త్వరగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఈ సమయంలో చాలా మంది కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. వారికి బీట్-క్యారెట్ రసం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. క్యారెట్ బీట్‌రూట్ రసం వైద్యం కోసం మంచిది. మీకు జీర్ణ సమస్యలు ఉంటే, మీరు సులభంగా ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. మీరు త్వరగా ఉపశమనం పొందుతారు. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది మలబద్ధకం, అజీర్ణం గ్యాస్ వంటి సమస్యల నుండి కూడా ఉపశమనం పొందుతుంది. బీట్-క్యారెట్ రసం అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి. నిత్యం తాగితే కొద్దిరోజుల్లోనే కోలుకుంటుందని తెలిపారు. శరీరంలో రక్తం లేని వారికి బీట్-క్యారెట్ జ్యూస్ చాలా మంచిది. ఇది ఇనుము యొక్క మంచి మూలం, ఇది శరీరంలో రక్త లోపాన్ని పూరించడానికి సహాయపడుతుంది. దీన్ని తినడం వల్ల ఎర్ర రక్త కణాల నిర్మాణం పెరుగుతుంది. ఇది మిమ్మల్ని ఇతర సమస్యల నుండి కూడా కాపాడుతుంది.

## చెప్పులు లేకుండా నడవడం మంచిదేనా..?



నడక ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే. కానీ చెప్పులు లేకుండా నడవడం మంచిదా..? లేక బూట్లు ధరించాలా..? అనేది చాలా మంది ఆలోచించే విషయం. చెప్పులు లేకుండా నడవడం కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తే.. బూట్లు రక్షణ కల్పిస్తాయి. అయితే ఏది మంచిది..? నడక అనేది ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలుసు. అయితే చెప్పులు లేకుండా నడవడం మంచిదా..? లేక బూట్లు ధరించడం అవసరమా..? అని చాలా మంది ఆలోచిస్తారు. కొందరికి చెప్పులు లేకుండా నడవడం సౌకర్యవంతంగా ఉంటుంది. మరికొందరికి బూట్లు ధరించడం అవసరమని భావిస్తారు. ఈ విషయంలో సరైన సమాధానం ఒకటే ఉండదు. అది ప్రతి వ్యక్తి పరిస్థితిని బట్టి ఉంటుంది. చెప్పులు లేకుండా నడవడం అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. చెప్పులు లేకుండా నడిచినప్పుడు పాదాల కండరాలు సహజంగా కదులుతాయి. ఇది కండరాలను బలపరచడంలో సహాయపడుతుంది. మన పాదాల్లో ఉండే నరాలు మెదడుకు కీలకమైన సమాచారాన్ని పంపిస్తాయి. చెప్పులు లేకుండా నడవడం వల్ల ఈ నరాలు సక్రియంగా మారి సమతుల్యతను మెరుగుపరుస్తాయి. నడక క్రమంలో తుంటి, మోకాళ్ళపై ఒత్తిడిని తగ్గిస్తుంది. చెప్పులు లేకుండా నడవడం మంచిదే అయినప్పటికీ కొన్ని సమస్యలు కూడా ఉండొచ్చు. కఠినమైన ఉపరితలాలపై వేడి, పదునైన వస్తువులపై నడవడం వల్ల గాయాలు జరుగవచ్చు. అలాగే ఎక్కువసేపు బహిరంగ ప్రదేశాలలో చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. శరీరం అలవాటు పడటానికి కొంత సమయం పట్టవచ్చు. మొదట్లో నొప్పి లేదా అసౌకర్యం కలగవచ్చు. బూట్లు పాదాలను రక్షించడం కోసం తయారయ్యాయి. ఇవి పాదాలను పదునైన వస్తువులు, వేడి ఉపరితలాలు నుండి కాపాడుతాయి. బూట్లలో ఉన్న ఆర్చ్ సపోర్ట్, కుషనింగ్, షాక్ అబ్జార్షన్ కీళ్ళపై ఒత్తిడిని తగ్గిస్తాయి. కఠినమైన ఉపరితలాలపై నడుస్తున్నప్పుడు ఇవి మంచి రక్షణ ఇస్తాయి. అలాగే బూట్లు పాదాలకు మురికిని, బ్యాక్టీరియాలను చేరకుండా ఆపుతాయి. బూట్లు ఉపయోగించడం మంచిదే అయినప్పటికీ వాటి వల్ల పాదాల కండరాలు బలహీనపడతాయి. ఎక్కువ సేపు బూట్లు ధరించడం వల్ల కండరాలు బలాన్ని కోల్పోతాయి. సరిగ్గా సరిపోని బూట్లు, హై హీల్స్ వంటి వాటి వల్ల పాదాలపై ఒత్తిడి పెరిగి గాయాలు కలగవచ్చు. ఇది మీ నడక పరిస్థితులకు, పాదాల ఆరోగ్యానికి ఆధారపడి ఉంటుంది. మృదువైన ఉపరితలాలపై చెప్పులు లేకుండా నడవడం పాదాల ఆరోగ్యానికి మంచిది. కఠినమైన లేదా ప్రమాదకరమైన ఉపరితలాలపై బూట్లు ఉపయోగించడం అవసరం. కాబట్టి రెండు నడక రకాల మధ్య సమతుల్యత కలిగి ఉండటం ఉత్తమం.

## వేసవిలో మిమ్మల్ని కూల్‌గా ఉంచే చల్లని పానియాలు..



మండే ఎండల్లో జనాలు శీతల పానియాలు తాగి కాస్త ఉపశమనం పొందుతుంటారు. అయితే ఆరోగ్యానికి హాని తలపెట్టే రసాయనాలు కలిపిన కూల్ డ్రింక్స్ తాగే బదులు ఈ కింది సహజ పానియాలు తాగారంటే ఆనందంతో పాటు ఆరోగ్యం కూడా మీ సొంతం. వేసవి మొదలైంది. ఉదయం పది గంటల నుంచే మండే ఎండలకు మాడు పగులుతుంది. ఎండలు వేడిని భరించలేక జనాలు ఉపశమనం కోసం శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుకోవడానికి రకాల కూల్ డ్రింక్స్ తాగుతున్నారు. కూల్ డ్రింక్స్ తాగితే వాటిల్లోని రసాయనాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కానీ ఈ కింది పానియాలు తాగితే శరీరాన్ని చల్లబరచడమే కాకుండా సూర్యుని వేడికి గాయపడ్డ చర్మానికి చికిత్స చేస్తుంది. ప్రకాశవంతమైన చర్మం కోసం నారింజ, అల్లం జ్యూస్ తాగవచ్చు. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మాన్ని ఖఎ కిరణాల నుంచి రక్షిస్తుంది. ఈ అల్లం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. రక్త ప్రసరణను పెంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. వేసవిలో ప్రతిచోటా లభించే పండ్లలో పుచ్చకాయ ఒకటి. ఇది హైడ్రేటింగ్ మాత్రమే కాకుండా ఇందులో విటమిన్లు ఎ, సి, లైకోపీన్‌లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ పండు రసం చర్మాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి చర్మపు మంట, మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇందులో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ చర్మ నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది. అల్లంలో ఉండే పోషకాలు చర్మాన్ని కాంతివంతం చేస్తాయి.

సిట్రస్ పండు అయిన నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. నిమ్మ, పుదీనా రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మంలో అనేక మార్పులు వస్తాయి. నిమ్మకాయకు ముఖం కాంతిని పెంచే గుణం కూడా ఉంటుంది. పుదీనాలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి మొటిమలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి.

## ఖర్బూజా ఆరోగ్యానికి మంచిదే..



వేసవిలో శరీరాన్ని చల్లబరిచే ఆహారాల్లో ఖర్బూజా ఒకటి. దీనిని చాలా మంది ఇష్టంగా తింటారు. దీన్ని తినడం వల్ల దాహం తీరుతుంది. ముఖ్యంగా ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల, వేసవి తాపాన్ని తట్టుకునే శక్తిని ఇస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో కూడా ఇవి సహాయపడతాయి. వేసవిలో శరీరాన్ని చల్లబరిచే ఆహారం తినడం అందరికీ అలవాటే. ముఖ్యంగా ఈ కాలంలో పుచ్చకాయ, కీర, ఖర్బూజా వంటి పండ్లు ఎక్కువగా తింటూ ఉంటారు. వేసవిలో అధికంగా వచ్చే పండ్లలో ఖర్బూజా ఒకటి. ఇది చాలా మందికి ఇష్టమైన పండు కూడా. దీన్ని తినడం వల్ల దాహం తీరుతుంది. ముఖ్యంగా ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల, వేసవి తాపాన్ని తట్టుకునే శక్తిని ఇస్తుంది. ఇందులో విటమిన్ ఇ, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన పోషణను అందించడమే కాకుండా జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో కూడా ఇవి సహాయపడతాయి. అయితే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఖర్బూజా తినకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ ఉన్నవారు సాధారణంగా ఖర్బూజా ఎక్కువగా తినకూడదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ పండు గ్లైసెమిక్ ఇండెక్స్ 60-80 మధ్య ఉంటుంది. అందువల్ల ఈ పండు అధికంగా తీసుకుంటే, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవచ్చు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు దీన్ని తినడానికి ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలెర్జీలు లేదా చర్మ సమస్యలతో బాధపడేవారు పుచ్చకాయ తినకూడదని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే కొంతమందికి ఈ పండు తిన్న వెంటనే దద్దుర్లు, దురద, వాపు వస్తుంది. కాబట్టి, ఈ పండును వైద్యుడి సలహా మేరకు మాత్రమే తీసుకోవడం మంచిది. పేగు సమస్యలు, గ్యాస్, ఉబ్బరం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబిఎస్) ఉన్నవారు కార్బోహైడ్రేట్లు తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, జీర్ణక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికంగా తీసుకుంటే అది ప్రేగులలో వాయువును పెంచి, అసౌకర్యాన్ని కలిగిస్తుంది. సాధారణంగా కిడ్నీ సమస్యలతో బాధపడేవారు పుచ్చకాయ తినకూడదు. ఇందులోని అధిక పొటాషియం కంటెంట్ మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, శరీరంలో పొటాషియం పేరుకుపోయి ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. ఇది అధికంగా తీసుకుంటే శరీరంలో సోడియం స్థాయిలు తగ్గవచ్చు. తద్వారా హైపోనాట్రేమియా అనే సమస్య పెరగవచ్చు. దీనివల్ల శరీరంలో వాపు, నిర్జలీకరణం, మూత్రపిండాల సమస్యలు వస్తాయి. ఉదయం లేదా మధ్యాహ్నం ఖర్బూజా తినడం మంచిది.



# సినిమా





## అద్భుతమైన ప్రాంతం.. అలా చూసి నిరుత్సాహానికి గురయ్యా: రాజమౌళి


దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 మూవీతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఒడిశాలోని కోరాపుట్ పర్వత ప్రాంతాల్లో జరిగింది. అక్కడ మొదటి షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్రబృందం ప్యాకప్ చెప్పేసింది. దీంతో మూవీ టీమ్ అంతా తమ లోకేషన్ నుంచి తిరుగుపయనమయ్యారు. ప్రియాంక చోప్రా తాను ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుండగా తీసిన ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. తాజాగా ఎస్ఎస్ రాజమౌళి ఈ మూవీ షూటింగ్ లోకేషన్ సంబంధించిన ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఒడిశాలోని అత్యంత ఎత్తైన, అద్భుతమైన శిఖరం డియోమాలికి ట్రెక్కింగ్ చేసినట్లు వెల్లడించారు. పైనుంచి చూస్తే అత్యంత ఉల్లాసభరితంగా అనిపించిందని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. అయితే ఆ పర్వతంపై పర్యాటకులు చెత్త చెదారం ?అలాగే ఉంచడం చూసి నిరుత్సాహానికి గురైనట్లు తెలిపారు. ఇటువంటి సహజమైన అద్భుతమైన ప్రాంతాలను ఎంతో బాగా చూసోకోవాలి.. ఒక ఒక్కరూ పౌరుడు బాధ్యతగా తీసుకుంటే చాలా పెద్ద మార్పు వస్తుంది... ప్రతి సందర్శకుడు ఇలాంటి ఆహ్లాదకరమైన స్థలాలను రక్షించడంలో సహాయపడటానికి  మీ వ్యర్థాలను  తిరిగి మీరే తీసుకువెళ్లాలని రాజమౌళి సూచించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## అద్భుతమైన ప్రాంతం.. అలా చూసి నిరుత్సాహానికి గురయ్యా


దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 మూవీతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఒడిశాలోని కోరాపుట్ పర్వత ప్రాంతాల్లో జరిగింది. అక్కడ మొదటి షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్రబృందం ప్యాకప్ చెప్పేసింది. దీంతో మూవీ టీమ్ అంతా తమ లోకేషన్ నుంచి తిరుగుపయనమయ్యారు. ప్రియాంక చోప్రా తాను ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుండగా తీసిన ఫోటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. తాజాగా ఎస్ఎస్ రాజమౌళి ఈ మూవీ షూటింగ్ లోకేషన్ సంబంధించిన ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఒడిశాలోని అత్యంత ఎత్తైన, అద్భుతమైన శిఖరం డియోమాలికి ట్రెక్కింగ్ చేసినట్లు వెల్లడించారు. పైనుంచి చూస్తే అత్యంత ఉల్లాసభరితంగా అనిపించిందని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. అయితే ఆ పర్వతంపై పర్యాటకులు చెత్త చెదారం ?అలాగే ఉంచడం చూసి నిరుత్సాహానికి గురైనట్లు తెలిపారు. ఇటువంటి సహజమైన అద్భుతమైన ప్రాంతాలను ఎంతో బాగా చూసోకోవాలి.. ఒక ఒక్కరూ పౌరుడు బాధ్యతగా తీసుకుంటే చాలా పెద్ద మార్పు వస్తుంది... ప్రతి సందర్శకుడు ఇలాంటి ఆహ్లాదకరమైన స్థలాలను రక్షించడంలో సహాయపడటానికి  మీ వ్యర్థాలను  తిరిగి మీరే తీసుకువెళ్లాలని రాజమౌళి సూచించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## చట్ట ప్రకారమే బెట్టింగ్ యాప్‌కి ప్రమోషన్.. వివరణ ఇచ్చిన విజయ్ దేవరకొండ టీమ్..!



బెట్టింగ్ యాప్స్ కేసు అంశంపై టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ టీమ్ వివరణ ఇచ్చింది. చట్టం ప్రకారం అనుమతి ఉన్న గేమ్స్‌కి మాత్రమే విజయ్ ప్రచారం చేశారని టీమ్ పేర్కొంది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కే విజయ్ ప్రకటనలు చేశారని పేర్కొంది.అనుమతి ఉన్న ప్రాంతాలకు మాత్రమే విజయ్ ప్రచారకర్తగా పని చేశారని తెలిపింది. అనుమతి ఉన్న ఏ23 సంస్థకు విజయ్ ప్రచారకర్తగా పని చేశారని, రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని సుప్రీంకోర్టు పలుసార్లు చెప్పినట్లుగా పేర్కొంది. ఏ 23 సంస్థతో విజయ్ ఒప్పందం గతేడాది ముగిసిందని విజయ్ దేవరకొండ టీమ్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆ సంస్థతో విజయ్‌కి ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. విజయ్ దేవరకొండ విషయంలో పలు మాధ్యమాల్లో వస్తున్న వార్తలో ఎలాంటి నిజం లేదని.. నటుడు ఇల్లీగల్‌గా పని చేస్తున్న ఏ సంస్థకు ప్రచారకర్తగా పనిచేయలేదని వివరణ ఇచ్చింది. బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేస్తున్న పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటికే 25 మందిపై కేసులు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారని.. వాటి కారణంగా యువత తీవ్రంగా నష్టపోతున్నారంటూ మియాపూర్‌కు చెందిన ప్రమోద్ శర్మ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బెట్టింగ్ ప్రమోషన్స్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సైతం సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో నీతూ అగర్వాల్, విష్ణుప్రియ, వర్షిణి, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభాశెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పద్మావతి, పండు, ఇమ్రాన్ ఖాన్, హర్షసాయి, బయ్యా సన్నీ యాదవ్, టేస్టీ తేజ, బండారు సుప్రీత, రీతూచౌదరి, శ్యామల కేసులు నమోదు చేశారు. ఇందులో విచారణకు హాజరుకావాలంటూ పలువురికి నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలోనే గురువారం టాలీవుడ్‌కు చెందిన నటీనటులు రాణా దగ్గుబాటి, మంచు లక్ష్మి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, ప్రణీత, అనన్య నాగళ్లతో పాటు యాంకర్ శ్రీముఖికి సైతం నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలోనే విజయ్ దేవరకొండ టీమ్ వివరణ ఇచ్చింది.



## బ్లాక్ బస్టర్‌కి కేరాఫ్ అడ్రెస్‌గా మారిన నాని..

టాలీవుడ్ హీరో నాని ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు.కష్టాన్ని నమ్ముకొని టాప్ హీరోగా ఎదిగాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌తో అతని కెరీర్ మొదలు కాగా ఇప్పుడు టాప్ హీరోలలో ఒకరిగా, సక్సెస్ ఫుల్ నిర్మాతగా కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు నాని. సహజ నటనతో నేచురల్ స్టార్ అనే బిరుదుని కూడా దక్కించుకున్నాడు. ఇక నిర్మాతగా మంచి కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తూ అలరిస్తున్నాడు. నాని సినిమాలు సూపర్ హిట్ కాకపోయిన ఫ్లాప్ అయితే కావు. కనీసం ఎబోవ్ యావరేజ్ అయిన నడుస్తుంది. గత కొన్నేళ్లుగా నాని సినీ రంగంలో చేసిన ప్రయోగాలు, తీసుకున్న నిర్ణయాలు పరిశీలిస్తే అతని టాలెంట్ ఏ పాటిదో అర్థమవుతుంది. ఓ స్టార్ హీరోగా భారీ మార్కెట్ కలిగి ఉండే నాని, మాస్ యాక్షన్ సినిమాలకు పరిమితం కాకుండా, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళుతున్నాడు. 'దసరా' లాంటి గ్రామీణ యాక్షన్ డ్రామా తీసిన నాని , వెంటనే 'హాయ్ నాన్న' లాంటి హృదయాన్ని తాకే కుటుంబ కథా చిత్రం చేశాడు. నిర్మాతగా ఇండస్ట్రీకి కొత్త వారిని పరిచయం చేస్తూ మంచి సక్సెస్‌లు అందుకుంటున్నాడు. 'అ!'తో ప్రశాంత్ వర్మను, 'జర్సీ'తో గౌతమ్ తిన్ననూరిని, 'శ్యామ్ సింగరాయ్'తో రాహుల్ సాంకృత్యాయన్‌ను, 'దసరా'తో శ్రీకాంత్ ఒదేలాను, 'హాయ్ నాన్న'తో షౌర్యువ్ వంటి దర్శకులని ఇండస్ట్రీకి పరిచయం చేసిన ఘనత నానిదే. తాజాగా కోర్ట్ అనే సినిమాతో రామ్ జగదీష్ అనే డైరెక్టర్‌ని పరిచయం చేశాడు నాని.అతనిపై నాని పెట్టుకున్న అంచనాలు వమ్ము కాలేదు. సినిమా సూపర్ హిట్ అయింది. గతంలో ఎన్నో కోర్ట్ డ్రామాలు వచ్చాయి కాని నాని నిర్మించిన కోర్ట్ మాత్రం ఎమోషనల్‌గా ప్రేక్షకులని ఎంతగానో కదిలించింది. నాని ప్రత్యేకత ఏమిటంటే, కేవలం తన మార్కెట్‌ను మెయింటైన్ పెంచుకోవడం కాకుండా ఇండస్ట్రీకి కొత్త దర్శకులని పరిచయం చేస్తున్నాడు. 'నాని నమ్మితే ఓ సినిమా హిట్ అవ్వగలదు' , 'నాని వెంట ఉంటే చిన్న సినిమా కూడా బ్లాక్‌బస్టర్' అనే నమ్మకం సినీ ప్రేక్షకులకి వచ్చేసింది. ఇక నాని రానున్న రోజుల్లో ఇంకెంత మంది కొత్త దర్శకులని ఇండస్ట్రీకి పరిచయం చేస్తాడో, ఎలాంటి భిన్నమైన కథలని ప్రేక్షకుల ముందుకు తెస్తాడో చూడాలి.

# బయట ప్రశ్నిస్తే జైళ్లకు.. లోపల ప్రశ్నిస్తే సస్పెండ్

-మొదటిపేజీ తరువాయి

మాంద్యమా? ఆత్మ విమర్శ చేసుకోండి. తెలంగాణకు మాత్రమే ఇది రావడానికి పరిపాలనా వైఫల్యమే. పక్క రాష్ట్రాలకు లేని ఆర్థిక మాంద్యం తెలంగాణకే ఎందుకొచ్చింది? ఈ తగ్గుదలకు కారణం ఆర్థిక మాంద్యం కాదు ఆలోచించుకోండి. నేను చాలా బాధగా చెబుతున్నాను. ముఖ్యమంత్రి ఇస్తున్న నినాదం తెలంగాణ రైజింగ్, బట్ వేర్ ఈజ్ ఇట్ రైజింగ్. జీఎస్టీ గ్రోత్ రేట్ డౌన్..స్టాంప్స్ రిజిస్ట్రేషన్ రెవెన్యూ డౌన్.. వెహికిల్ సేల్స్ డౌన్ అంటూ హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

ఆర్థిక క్షీణతకు అసలు కారణాలు ఇవే..

రీజన్ 1 %-% రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలోనేదివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా దివాలా అని దిక్కుమాలిన ప్రచారం చేయడం వల్ల పెట్టుబడులు రాలేదు.

రీజన్ 2- ప్రభుత్వం కొలువుదీరగానే ఫార్మా సిటీ రద్దు, ఎయిర్ పోర్టుకు మెట్రో రైలు రద్దు అనే నెగిటవ్ ప్రచారం.

రీజన్ 3-హైడ్రా పేరిట సాగించిన విధ్వంస కాండ -పేదల ఇండ్ల కూల్చివేతలు

రీజన్ 4- మూసీ ప్రక్షాళన పేరిట, బఫర్ జోన్ల పేరిట చేసిన హంగామా %-% సృష్టించిన భయానక వాతావరణం. పెట్టుబడులు రాలేదు, రియల్ ఎస్టేట్ పడిపోయింది.

రీజన్ 5- ఆర్ ఆర్ టాక్స్ లు

రీజన్ 6- సంక్షేమ పథకాల ద్వారా గ్రామాల వైపు సాగుతున్న ద్రవ్య ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూడా దెబ్బతిన్నది.

వీటితో పాటు రైతు బంధు ఇవ్వకపోవడం, పంట కొనుగోలు పూర్తిగాచేయకపోవడం, పింఛన్లు పెంచక పోవడం, ఉన్న పింఛన్లు రెండు నెలలు ఎగ్గొట్టడం, నీళ్లివ్వక పంటలను ఎండగొట్టడం, చెరువుల్లో చేప పిల్లలు వదలక పోవడం, గొర్రెల పంపిణీ నిలిపి వేయడం, గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వక పోవడం, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు చెల్లించక పోవడం, రియల్ ఎస్టేట్ కుప్పకూలడం, ఇలాంటికారణాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి క్రమంగా తగ్గుతూ, ఆర్థిక వృద్ధి వేగం మాంద్యం వైపు అడుగులు పడుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గత బీఆర్ఎస్ పై దుష్ప్రచారం తప్పించుకుంటున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. “భట్టి గారు తన బడ్జెట్ ప్రసంగంలో.. నిజాలు ప్రచారంలో ఉండాలి, లేదంటే అబద్ధం నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుందని” చెప్పారు. నేను వారి మాటలతో నేను ఏకీభవిస్తున్నాను. “నువ్వు రోజూ అబద్ధం ఆడితే, అది నిన్ను రేపు కూడా అబద్ధం ఆడే దుస్థితికి తెస్తుంది” ఇది శ్రీశ్రీ గారు చెప్పిన మాట. మీరు అదే పనిగా చేస్తున్న అబద్ధాలను పటాపంచలు చేసి సత్యాన్ని చెప్పదలుచుకున్నాను. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ భద్రం అనేది నిజం, ఛిద్రమైందనేది అబద్ధం. ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందనడం అబద్ధం, బలోపేతమైందన్నది నిజం. పదేండ్ల పాలనలో ఆర్థిక అరాచకత్వం అన్నది అబద్ధం.. ఆర్థిక స్థిరత్వం సాధించిందనేది అసలు నిజం. దివాలా తీసిందనేది అబద్ధం. దివ్యంగా ఉన్నదన్నది నిజం. కేసీఆర్ సంపద పెంచింది నిజం, ప్రజలకు పంచింది నిజం. 2013-14లో 4లక్షల 50వేలుగా ఉన్న జీఎస్డీపీ తొమ్మిదిన్నరేండ్లలో 15లక్షల కోట్లకు పెరిగింది. ఇది అక్షర సత్యం. మా పాలనలో 12శాతంగా ఉన్న జీఎస్డీపీ వృద్ధి రేటు, కాంగ్రెస్ ఏడాది పాలనలో 10శాతానికి తగ్గింది. 1లక్షా 24వేలుగా ఉన్న తలసరి ఆదాయం మా పదేళ్ల పాలనలో 3లక్షల 56వేలకు పెరిగింది. ఇది మీరు కూడా ఒప్పుకొని, చెప్పుకుంటున్న సత్యం. మా



పాలనలో 12.4శాతంగా ఉన్న తలసరి ఆదాయం వృద్ధి రేటు మీ పాలనలో 9.6శాతానికి తగ్గింది. 2014-15 లో62,306 కోట్లున్న ప్రభుత్వ వ్యయం,2023-24 నాటికి 2,31,825 కోట్లకుపెంచాం. అనగా నాలుగు రెట్లు పెంచినం. సంపద పెంచినం, పేదలకు పంచినం అనడానికి ఇది నిదర్శనం. సొంత ఆదాయ వనరుల వృద్ధిలో దేశంలోనే తెలంగాణనునంబర్ వన్ రాష్ట్రంగా నిలిపాం. మా పాలనలో గ్రోత్ రేట్ ఆకాశం వైపుచూస్తే, మీ పాలనలో పాతాళం వైపు చూస్తున్నది. దివాలా తీసింది రాష్ట్రం కాదు, మీ ఆలోచనలు దివాలా. మీరు అనుసరిస్తున్న విధానాలు దివాలా.మొత్తంగా మీ పరిపాలన దివాలా ఉంది. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాళా తీయలేదు అని హరీశ్‌రావు తెలిపారు.

### రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న ఎర్రర్ కారణంగా.. టెర్రర్‌ను చూపిస్తున్నారు : హరీశ్‌రావు

రాష్ట్ర ప్రజలు రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న ఒకేఒక్క ఎర్రర్ కారణంగా.. టెర్రర్‌ను చవిచూపిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పాలనపై ప్రశ్నిస్తున్న వారి పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా ప్రవర్తిస్తూ, జైళ్ల పాలు చేస్తుందని మండిపడ్డారు. అడుగడుగునా అణచివేతలు ఉన్నాయన్నారు హరీశ్‌రావు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు.

రాహుల్ గాంధీ మొహబ్బత్ క దుకాన్ అని దేశం అంతా తిరుగుతున్నడు. రేవంత్ పాలన నఫ్రత్ కా మకాన్ గా మారింది. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వస్తదంటే జనం ఏమో అనుకున్నరు. ఎమర్జెన్సీ నాటి అణిచివేతలు, నిర్బంధాలు పునరావృతం అవుతాయని ఇప్పుడు స్పష్టమైంది. 7వ గ్యారెంటీగా ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఆరు గ్యారెంటీలకు ఏ గతి పట్టిందో, ఏడో గ్యారెంటీకి అంతకంటే అధ్వాన్నమైన గతి పట్టింది. ప్రశ్నిస్తే అరెస్టులా? నిరుద్యోగులు నిలదీస్తే లాఠీ చార్జీలా? మా భూముల్లో ఫార్మా చిచ్చు పెట్టవద్దన్నందుకు%ొ% లంబాడీ బిడ్డలపై లాకప్ హింసలా? రైతు చేతులకు బేడీలు వేసి తీసుకు వస్తరా. ఇదేనా ప్రజా పాలన అంటే? ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు నిరసనలు చేసే హక్కు తొలగిస్తారా? ఎన్నికలకు ముందేమో ప్రజలారా స్వేచ్ఛగా పోరాడండి అన్ని వర్గాలను రెచ్చగొట్టారు, ఎన్నికలయ్యాక పోరాడే ప్రతి వారినీ చావగొడుతున్నారు. ఫిరాయింపులను నిలదీస్తే ఇండ్లపై దాడులు చేస్తారు. పసిపిల్లలు తమ పుస్తకాలు తీసుకోనివ్వకుండా ఇండ్లు కూలగొడుతారు. లైబ్రరీలో చొరబడి విద్యార్థుల వీపులు వాయగొడుతారు. శాసనసభ బయట ప్రశ్నిస్తే జైళ్లకు పంపిస్తారు. శాసనసభ లోపల ప్రశ్నిస్తే సస్పెండ్ చేసి బయటకు వెళ్లగొడుతుంది ఈ ప్రభుత్వం అంటూ హరీశ్‌రావు మండిపడ్డారు.

ఇక క్రైమ్ రేటు చూస్తే ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలే కొలమానం. ఈ రోజు రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజు రోజుకీ దిగజారుతున్నాయి. ఈ ఏడాది క్రైం రేటు 24శాతం ఎక్కువగా నమోదైందని మీరు పెట్టుకున్న డీజీపీనే చెబుతున్నారని సభకు హరీశ్‌రావు తెలిపారు.

ఇగ రుణమాఫీ.. అదొక దారుణ విషాద గాథ : హరీశ్‌రావు

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నట్లు 100 శాతం రుణమాఫీ కాలేదని, ఇంకా చాలా మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. వాస్తవం ఏమిటంటే, రైతు ఇంటికి, బ్యాంకుకు మధ్య తిరుగుతూనే ఉన్నరు. రుణమాఫీ విషయంలో చివరకు రైతుకు మిగిలింది ఒడువని దు:ఖం, తీరని అప్పు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు.

ఇగ రుణమాఫీ అదొక దారుణ విషాద గాథ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్ల మీటింగ్‌లో సంపూర్ణ రుణమాఫీకి కావాల్సింది. 49,500 వేల కోట్లుగా చెప్పారు. ఒక్క సంవత్సరం అవినీతి చేయకుండా కడుపు కట్టుకుంటే 41 వేల కోట్లు ఒక్క దెబ్బకు మాఫీ చేయొచ్చనిఆరోజు చెప్పారు. భట్టి విక్రమార్క గత బడ్జెట్ ప్రసంగంలో 31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఈ బడ్జెట్ లోనేమో 20 వేల కోట్లు ఇచ్చాం అంటున్నరు. కానీ వాస్తవానికి అది 15, 16 వేల కోట్లు కూడాచేరలేదు. వాస్తవం ఏమిటంటే, రైతు ఇంటికి, బ్యాంకుకు మధ్య తిరుగుతూనే ఉన్నరు. చివరకు రైతుకు మిగిలింది ఒడువని దు:ఖం, తీరని అప్పు అని హరీశ్‌రావు అన్నారు. అధ్యక్షా ఇంకా బాగా అర్థం కావాలంటే నా సిద్దిపేట నియోజకవర్గంలో పరిస్థితే ఉదాహరణగా చెబుతా%ొ% బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులు 43,363 మంది. రుణమాఫీ అయ్యింది కేవలం 20,514 మంది. రుణమాఫీ కాని రైతులు 22,849. అంటే ఫైనల్ గా రుణమాఫీ అయిన రైతుల సంఖ్య తక్కువ, రుణమాఫీ కాని రైతుల సంఖ్యేఎక్కువ. ఇందులో 2లక్షల లోపు కానివారు 10,212 ఉండటం గమనార్హం. ప్లీజ్ నోట్ దిస్ పాయింట్. రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న వారు మీదున్నది కట్టండి. మిగతాది మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆయన మాటలునమ్మి చాలా మంది రైతులుఅప్పు తెచ్చి పైసలు కట్టిన్రు అధ్యక్షా. మా నియోజకవర్గవంలోనిగుర్రాలగొంది గ్రామంలో దమ్మర్ పల్లి శ్రీనివాస్ రెడ్డి అనే రైతు యూబిఐ బ్యాంకులో ఆగస్టు 30, 2024 నాడు రెండు లక్షల మీదున్న 50వేలు కట్టిండు. నారాయణ రావు పేటకు చెందిన జి సత్తి రెడ్డి అనే రైతు 2.60లక్షల రుణం ఉంటే, మిత్తితో కలిపి యూబిఐ బ్యాంకులో మీద 76 వేలు కట్టిండు. బంజేరుపల్లికి చెందిన మరో రైతు అక్తర్ ఖుస్రో 2 లక్షల 600 అప్పు ఉంటే, మిత్తితో కలిపి మీదున్న 10 వేలు కట్టిండు. వారికి ఈరోజు వరకు కూడా రుణమాఫీ కాలేదు, అప్పులే మీద పడ్డయి. ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి అధ్యక్షా అని హరీశ్‌రావు తెలిపారు. దయచేసి చేతులు జోడించి ప్రార్థిస్తున్నా.. ఈరోజుకూ వారికి రుణమఫీ కాలేదు, ఎప్పుడు చేస్తారో చెప్పడం లేదు. ఇంత చర్చ ఎందుకు భట్టి గారు.. మీ మధిరకు పోదామా? లేదా మా సిద్దిపేటకు వస్తారా? ఈ రాష్ట్రంలో ఏ ఊరుకు పోదామోమీరే చెప్పండి. సంపూర్ణ రుణమాఫీ జరిగి ఉంటే క్షమాపణలు చెప్పడానికి నేను సిద్ధం? మీరు సిద్ధంగా ఉన్నారా? ఒక్క సంవత్సరం కడుపు కట్టుకుంటే రుణమాఫీ అవుతుందన్నారు. ఇవాళ కడుపు కట్టుకోనిది ఎవరో, అవినీతికి పాల్పడిందెవరో తెలుస్తున్నది అధ్యక్షా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## తెలంగాణ పరువు తీసిందెవరు?



-మొదటిపేజీ తరువాయి

సభ్యులు లేరు. మహిళలు పొదుపు చేసుకున్న రూ.1800 కోట్ల అభయ హస్తం నిధులు ఇవ్వలేదు. పావలా వడ్డీ ఇవ్వలేదు. మహిళ సంఘాలకు ఇవ్వాల్సిన రూ. 3700 కోట్ల వడ్డీలు చెల్లించలేదు. తెలంగాణను మీరు సస్యశ్యామలం చేస్తే.. రైతులు ఎందుకు ఇబ్బందులు పడ్డారు” అంటూ సీతక్క ప్రశ్నించారు. “మేము పంట కాలువలు మూసివేసినట్లుగా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ డీఎన్ఏలోనే కరప్షన్ ఉంది. ఇష్టానుసారంగా ఎస్టిమేషన్స్ పెంచి దోచుకుతున్నారు. మీరు నోటిఫికేషన్లు ఇస్తే నియామకాలను ఎవరు అడ్డుకున్నారు?. మీరు చేయలేని ఉద్యోగాల భర్తీ మేం చేస్తున్నాం. 59 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. మీరు అన్ని చేస్తే ప్రజలు ఎందుకు ఓడిస్తారు. బీఆర్ఎస్ పెద్దలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మీరు బంపర్ మెజారిటీతో అధికారంలోకి రాలేదు. మీరు మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పుడు 63 సీట్లతో వచ్చారు. మేము 65 సీట్లతో అధికారులకు వచ్చాము. పదేళ్లలో ఎన్ని ఇండ్లు ఇచ్చారు?” అంటూ సీతక్క నిలదీశారు. “ప్రజలకు ఇళ్లు ఇవ్వలేదు కాబట్టి మిమ్మల్ని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు. మేము వచ్చి 15 నెలలు అయింది.. అప్పుడే అన్ని కావాలన్నట్టుగా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు.. వారి పేరు పథకాలకు పెడితే ఎందుకంత కడుపు మంట?, మీరు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. ఎన్నో హామీలు తుంగలో తొక్కారు. రాష్ట్రం పరువు తీసింది మీరే.. తప్పుడు ప్రచారం చేయొద్దు. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు విరుద్ధంగా అప్పల కోసమే కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది” అని సీతక్క హితవు పలికారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో హరీష్‌రావు భేటీ

-మొదటిపేజీ తరువాయి

తమ నియోజకవర్గంలో ఉన్న సమస్య కోసం సీఎం దగ్గరకు వెళ్లామని పేర్కొన్నారు. “మేము వెళ్లేసరికి సీఎం రూమ్ నిండా మంది ఉన్నారు. 15 నిమిషాల పాటు సీఎంతో ఏమీ మాట్లాడలేదు. పద్మారావు నియోజకవర్గంలో కేసీఆర్ మంజూరు చేసిన హై స్కూల్, కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలని సీఎం కోరాం. సీఎం వెంటనే వేం నరేందర్ రెడ్డికి ఆ పేపర్ ఇచ్చి చేయమని చెప్పారు”అని పద్మారావు తెలిపారు. పద్మారావు రమ్మన్నారని తాను కూడా వెళ్లినట్లు హరీష్‌రావు పేర్కొన్నారు. డీలిమిటేషన్ పై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో పెట్టిన మీటింగ్‌ను బహిష్కరించాం. చెన్నైలో జరిగే మీటింగ్ కాంగ్రెస్ ఆర్గనైజ్ చేయట్లేదు. డీఎంకే వాళ్ళు పిలిచారని మేము వెళ్తున్నాం. డీఎంకే మాకు ఫ్రెండ్లీ పార్టీ. ఘోష్ కమిటీ నివేదిక గురించి నాకు తెలియదు” అని హరీష్‌రావు చెప్పారు. కాగా, అంతకు ముందు.. సీఎం రేవంత్‌ను మల్లారెడ్డి కుటుంబ సభ్యులు కలిశారు. మెడికల్ కళాశాల సీట్ల పెంపు కోసం సీఎంను కలిసినట్లు మర్రి రాజశేఖరరెడ్డి చెప్పారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి చెన్నై బయలుదేరారు. తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన డీలిమినేషన్‌పై రేపు(శనివారం) చెన్నైలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ అఖిలపక్ష సమావేశానికి రేవంత్ హాజరుకానున్నారు.

## తెలంగాణలో భారీ వర్షం.. వడగళ్ల వాన

**కరీంనగర్:** తెలంగాణలోని పలు జిల్లాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడగా.. సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోనే ఈ అకాల వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో వడగండ్లు పడ్డాయి. ధర్మపురి మండలంలో ఈదురుగాలులతో కూడిన వానకురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేరేళ్ల, తుమ్మేనాల, ధర్మపురి, తిమ్మాపూర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోనూ భారీ వర్షం పడింది. భారీ వర్షాలు పడటంతో రైతులకు కొంతమేర నష్టం కలిగింది.

తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మార్చి 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వర్షాల కారణంగా.. వేడి తీవ్రతతో పాటు వడగాలులు సైతం తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో రెండు రోజుల పాటు ప్రజలకు వడగాలుల నుంచి ఉపశమనం పొందనున్నారు


## తక్కువ వడ్డీకే రుణాలివ్వండి

-మొదటిపేజీ తరువాయి

స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్స్ నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామ పంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి నాబార్డు ఛైర్మన్ ప్రతిపాదించారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రతినిధులతోపాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

## పరారీలో సెలబ్రిటీలు..

-మొదటిపేజీ తరువాయి



యాప్స్ గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లను నిందితులుగా చేర్చనున్నారు. అయితే బెట్టింగ్ యాప్స్ కేసులపై పోలీస్‌శాఖ లీగల్ ఒపీనియన్‌కు వెళ్లబోతుంది. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కి మాత్రమే ప్రకటనలు చేశామంటున్నారు విజయ్, రానా. అయితే సెలబ్రిటీల నుంచి కీలక అంశాలు రాబట్టిన పోలీసులు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపైన ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్ చేశారు. మరో 133 బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు నోటీసులు ఇచ్చారు. బెట్టింగ్ వెబ్‌సైట్లు తెలంగాణలో యాక్సెస్ కాకుండా. జియో-ఫెన్సింగ్ టెక్నాలజీతో %ు+జూదీ% చర్యలు తీసుకుంటోంది. కాగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో ఇప్పటికే విష్ణుప్రియ, రీతూచౌదరి, తేస్టీ తేజ, కిరణ్‌గౌడ్‌లను పోలీసులు విచారించారు. శ్యామల, అజయ్ సన్నీ, సుప్రీత, సన్నీ సుధీర్‌లను విచారణ కోసం సంప్రదించగా వారి ఫోన్లు స్విచాఫ్ వచ్చినట్లు సమాచారం. అలాగే మరికొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. విచారణ భయంతో హర్షసాయి, ఇమ్రాన్, భయ్యా సన్నీయాదవ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌తో సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు భారీగా లబ్ధి పొందారని, అసలు వారికి ఏయే మార్గాల్లో డబ్బు వచ్చిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

## బెట్టింగ్ యాప్స్‌పై పోలీసుల స్పెషల్ ఫోకస్..

# వారికి చుక్కలే..

**హైదరాబాద్:** బెట్టింగ్ యాప్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెట్టింగ్ యాప్స్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన వారి వివరాలను తెలంగాణ పోలీసులు సేకరిస్తున్నారు. ఇక, ఒక్కొక్కటిగా బెట్టింగ్‌లకు సంబంధించిన విషాదాలు వెలుగు చూస్తు?న్నాయి. ఏడాదిలో తెలంగాణలో బెట్టింగ్‌కు 25 మందికిపైగా బలయ్యారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకుని యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. హైదరాబాద్‌లోనే ఎనిమిది మందికిపైగా ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకున్నాయి. 2022 నుంచి ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని ఆత్మహత్యలు పెరిగాయని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడిన వారి కేసులను పోలీసులు వెలికి తీస్తున్నారు. అలాగే, బెట్టింగ్ యాప్స్‌ను గుర్తించే పనిలో పోలీసులు బిజీగా ఉన్నారు. నిర్వాహకులు, ప్రమోటర్లను పోలీసులు నిందితులుగా చేర్చారు. యాప్స్ ప్రమోషన్స్‌తో.. భారీగా లబ్ధి పొందిన సినీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్లుకు సదరు బెట్టింగ్ యాప్స్ కంపెనీల నుంచి ఏ విధంగా డబ్బులు అందాయి, ఏయే మార్గాల్లో ఈ డబ్బులు ప్రమోటర్లు తీసుకున్నారనే కోణంలో.. వారి బ్యాంకు లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కేసులు నమోదైన వారి సన్నిహితులు, కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలపై కూడా పోలీసులు దృష్టి సారించారు. మరోవైపు.. బెట్టింగ్ యాప్స్ ద్వారా డబ్బులు పోగొట్టుకున్న వారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. బెట్టింగ్ యాప్ ద్వారా 80 లక్షలు పోగొట్టుకున్న నెల్లూరుకు చెందిన రాంబాబు అనే బాధితుడు తాజాగా కీలక విషయాలను వెల్లడించారు. పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేయడంతో నెల్లూరు నుంచి నెల్లూరు నుంచి ఆవేదన చెప్పుకున్నాడు. ఈ సందర్భంగా




బాధితుడు రాంబాబు మాట్లాడుతూ.. ‘హీరోల ప్రమోషన్ చూసే నష్టపోయాను. నేను బెట్టింగ్ యాప్ లో పాల్గొని తప్పు చేశాను. నాకు ఏ శిక్ష పడినా పర్వాలేదు. బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్లకు శిక్ష వేయాల్సిందే. అప్పుల వాళ్లు ఊళ్లోకి రానివ్వట్లేదు. ఫోన్ నెంబర్ మార్చుకొని పిచ్చోడిలా తిరుగుతున్నాను. ఐపీఎస్ అధికారి సజ్జనార్ చొరవ తీసుకోవడంతో బెట్టింగ్ యాప్‌ల బాగోతం బయటకు వచ్చింది. బెట్టింగ్ యాప్ బాధితులు దేశవ్యాప్తంగా ఉన్నారు. అమాయకులు కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. వచ్చే రోజుల్లో రాజకీయ పార్టీలు బెట్టింగ్ యాప్‌లను నిషేధిస్తామని మేనిఫెస్టోలో పెట్టే రోజులు వస్తాయి’ అని వ్యాఖ్యలు చేశారు.

ఇదిలా ఉండగా.. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసిన కేసులో టీవీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు గురువారం సుదీర్ఘంగా విచారించారు. విష్ణుప్రియను 11 గంటల పాటు విచారించగా.. రీతూచౌదరి విచారణ ఐదున్నర గంటలకుపైగా కొనసాగింది. తొలుత ఇద్దరినీ వేర్వేరుగా.. అనంతరం కలిపి ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మూడు యాప్‌లకు ప్రచారం చేశానని విష్ణుప్రియ అంగీకరించినట్లు తెలిసింది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: APTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.